

రంజాన్ వేళలు | ఇఫ్తార్ (బుధ) సా.6.20 | సహరి (గురు) ఉ.4.57



విజయానందం : కోనసీమ జిల్లా మామిడికుదురులో బాణసంచా కాలుస్తున్న కూటమి నాయకులు

పేరాబత్తులకే.. పట్టాభిషేకం

కూటమికే గ్రాడ్యుయేట్లు జేజేలు



పేరాబత్తులకు మిఠాయి తినిపిస్తున్న టీడీపీ నాయకుడు

» పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీదే
» పేరాబత్తుల రాజశేఖరానికి 70,421 ఓట్ల ఆధిక్యత
» వీరరాఘవులుకు నిరాశ
» 30 గంటలపాటు లెక్కింపు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో తొలిసారిగా తెలుగు దేశం పతాక రెపరెపలాడింది. ఆ పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ ఆధిక్యతతో గెలుపొందారు. సుమారు 30 గంటలకుపైగా సాగిన ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ప్రారంభమై మంగళవారం మధ్యాహ్నం నాటికి ముగిసింది. ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి తెలుగుదేశం అభ్యర్థి ఆధిక్యతతో దూసుకుపోయారు. ఎక్కడా వెనుతిరిగి చూడలేదు. రౌండ్ రౌండ్‌కి 15 వేలకు తగ్గకుండా ఓట్లు సాధించడం, తన సమీప పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుపై ఆధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రులు తెలుగుదేశం వైపు మొగ్గారు. రాజశేఖరానికి భారీ మెజార్టీ అందించారు. ప్రాధాన్యత క్రమంలో టీడీపీ అభ్యర్థి అలవోకగా విజయం సాధించారు. చెల్లిన లక్షా 99 వేల 208 ఓట్లలో రాజశేఖరానికి లక్షా 24 వేల 702 ఓట్లు లభించాయి. మొత్తం చెల్లుబాటు అయిన ఓట్లలో 62.5 శాతం ఓట్లు టీడీపీ అభ్యర్థికే దక్కినట్టయ్యింది. టీడీపీ అభ్యర్థి రాజశేఖరానికి 77 వేల 421 ఓట్ల ఆధిక్యత లభించింది. మొత్తం ఎనిమిది రౌండ్లలో ఏ ఒక్క రౌండ్‌లోను మిగిలిన అభ్యర్థులు రాజశేఖరంను దాటలేకపోయారు. దీనికి తోడు పట్టభద్రుల నియోజకవర్గంలో టీడీపీ పక్షాన గెలిచిన ఏకైక అభ్యర్థి కూడా పేరాబత్తుల. ఈ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కైవసం చేసుకోవాలని మొదటి నుంచి కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగానే వ్యవహరించింది. కూటమి శ్రేణులు అన్నిచోట్లా ఏకమయ్యాయి. ఆఖరుకి ఓట్ల నమోదు దగ్గర నుంచి ఓటర్ల జాబితా విడుదల వరకు ఏ నియోజకవర్గానికి ఆ నియోజకవర్గం నేతలే దగ్గరుండి పరిశీలించుకున్నారు. తప్పొప్పులను బేరీజు వేశారు. పోలింగ్ సమయంలోను తీసుకున్న జాగ్రత్తలు పేరాబత్తులకు కలిసొచ్చాయి. ఈ కారణంగానే ప్రతి రౌండ్‌లోను తన విశ్వరూపాన్ని ప్రదర్శించారు. కౌంటింగ్ ఆరంభం నుంచి ఏదొక రౌండ్‌లో తమది పైచేయి కాకపోతుందా అని ఎదురుచూసిన పీడీఎఫ్ అభ్యర్థి వీర రాఘవులుకు నిరాశ తప్పలేదు. కాగా, వీర రాఘవులు ఓటమితో గడిచిన రెండు దఫాలుగా విజయం సాధించి ఈసారి హ్యాట్రిక్ సాధిద్దామనుకున్న పీడీఎఫ్ ఆశలు నెరవేరకుండాపోయాయి.

ఒక్కో రౌండ్‌కి 28 వేల ఓట్లు చొప్పున లెక్కించారు.. అలా 8 రౌండ్లలో మొత్తంగా 1,99, 208 ఓట్లు లెక్కించారు. తొలి రౌండ్ నుంచి టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. తర్వాత రాఘవులు ఉన్నారు.



విజేత రాజశేఖరంను అభినందిస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు

35 మందికీ.. ఓటు పడింది!

వ.స. అభ్యర్థి	ఓట్లు
1. పేరాబత్తుల రాజశేఖరం(టీడీపీ)	1,24,702
2. కాట్రు నాగబాబు	565
3. షేక్ హుస్సేన్	394
4. కట్టా వేణుగోపాలకృష్ణ	1017
5. కాండ్రేగుల నరసింహం	364
6. కాక్మాను కృష్ణమోహన్	190
7. కుక్కల గోవిందరాజు	269
8. కునుకు హేమకుమారి	956
9. కైలా లావణ్య	365
10. గౌతమీబాబు కొల్లు	317
11. చిక్కాల దుర్గారావు	665
12. తాళ్లూరి రమేష్	201
13. దత్తాత్రేయ నోరి	567
14. దిడ్ల వీరరాఘవులు(పీడీఎఫ్)	47,241
15. దొరబాబు యాళ్ల	303
16. నీతిపూడి సత్యనారాయణ	161
17. తిరిపి నాగభూషణవర్మ	68
18. పెప్పళ్ల సుజ్జు	479
19. పేపకాయల రాజేంద్ర	199
20. బొద్దు శ్రీనివాసరావు	152
21. బొమ్మనబోయిన వి.ఎస్.ఆర్.మూర్తి	119
22. బొమ్మిడి సన్నీరాజ్	398
23. బండారు రామ్మోహనరావు	709
24. భీమేశ్వరరావు చిక్కా	254
25. మాకె దేవీప్రసాద్	146
26. మెర్ల శాస్త్రులు	103
27. మోకా అంబేద్కర్	129
28. రాజపూడి	95
29. జి.టి.రామారావు	39
30. రేవులగడ్డ ముఖేష్‌బాబు	96
31. వానపల్లి శివగణేష్	772
32. శ్రీనివాస్ విష్ణువరుల	190
33. ఎం.శ్రీనివాసరావు	41
34. జి.వి.సుందర్	16,183
35. హసన్ షరీఫ్	759

8 రౌండ్లలో ఇద్దరికీ ఓట్లు ఇలా...

రౌండ్లు	పేరాబత్తుల	వీరరాఘవులు
1	16,520	5,815
2	16,212	5,421
3	16,191	5,570
4	15,482	6,446
5	15,632	6,413
6	16,254	5,949
7	16,040	5,654
8	12,371	5,973
మొత్తం	1,24,702	47,241

సుందర్‌కు మూడో స్థానం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన 35 మంది అభ్యర్థుల్లో టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మొదటి, పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవులు దక్కిన ఓట్లలో రెండో స్థానం సాధించగా మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు జి.వి.సుందర్ మూడో స్థానం దక్కించుకున్నారు.ఆయనకు 16,183 ఓట్లు దక్కాయి. మొదటి రౌండ్ నుంచి వెయ్యి ఓట్లు దాటి కొన సాగగలిగారు. మొదటి రౌండ్‌లో 1968, రెండో రౌండ్‌లో 2,238, మూడవ రౌండ్‌లో 2,119, నాల్గవ రౌండ్‌లో 2, 484, ఐదవ రౌండ్‌లో 2,208, ఆరవ రౌండ్‌లో 1,741, ఏడవ రౌండ్‌లో 2,106, ఎనిమిదవ రౌండ్‌లో 1,319 ఓట్లు దక్కాయి. 35 మంది అభ్యర్థులు ఉండగా మూడో స్థానం దక్కించుకోగలిగారు.



ఆది నుంచి ఒక్కటే లక్ష్యం

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తులను ప్రకటించిన టీడీపీ అడుగడుగునా పక్కా ప్రణాళికతో విజయం కోసం ముందుకు సాగింది. టీడీపీ అధినేత చంద్రబాబు,పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఎప్పటికప్పుడు నేతలను అప్రమత్తం చేశారు. ఎన్నిక జరిగినన్ని రోజులు ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయిలో పనిచేసేలా దిశానిర్దేశం చేశారు. జిల్లాల ఇన్‌చార్జి మంత్రులకు ప్రత్యేక బాధ్యత అప్పగించి ఎమ్మెల్యేలందరిని సమన్వయం చేసే బాధ్యత అప్పగించారు. దీంతో నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ విజయం తమ విజయంగా భావించి క్యాడర్‌తో సమీక్షలు, ఎన్నికల ప్రచారం వరకు అంతా తామే అయి నడిపించారు.ఇలా ఎవరికివారు కూటమి అభ్యర్థికి భారీ మెజార్టీ వచ్చేలా కష్టపడ్డారు. పేరాబత్తుల విజయంతో టీడీపీ నేతలు మంగళవారం జిల్లాలో పలు చోట్ల సంబరాలు జరిపారు. కూటమికి భారీ విజయాన్ని కట్టబెట్టిన నేపథ్యంలో ఆనందోత్సవాల్లో మునిగితేలారు.

గ్రాడ్యుయేట్లు.. జై కొట్టారు!

ఉమ్మడి జిల్లాలోనూ ఏకపక్షంగా ఓటింగ్

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం -ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఓటర్లు కూటమికి పట్టం కట్టారు. కొన్ని నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన ఏకపక్ష విజయం తరహాలోనే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోను జైకొట్టారు. మొత్తం ఓటు హక్కు వినియోగించుకున్న గ్రాడ్యుయేట్లలో 85శాతానికిపైగా కూటమి అభ్యర్థివైపే మొగ్గు చూపారు. దీంతో వైసీపీకి షాక్ తగిలింది. కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ నుంచి అభ్యర్థిని నిలబెడితే మళ్లీ పరాభవం ఎదురవుతుందనే భయంతో ఆ పార్టీ వెనక్కు తగ్గింది. అదే సమయంలో టీడీపీ అభ్యర్థికి ప్రధాన పోటీ ఇచ్చిన మరో అభ్యర్థికి తెరవెనుక సహకారం అందించింది. కూటమి ప్రభుత్వం పై వ్యతిరేకత పెంచే ప్రయత్నాలు చేసింది. ఎక్కడికక్కడ సోషల్ మీడియా గ్రూపుల్లోను కూటమిపై బురదజల్లే ప్రయత్నం చేసింది. కానీ ఎక్కడా గ్రాడ్యుయేట్ ఓటర్లు వీటిని వినిపించుకోలేదు. కూటమి అభ్యర్థికి ఏకపక్షంగా ఓటేశారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 62,970 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 36,361 మంది, మహిళలు 26,606 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. పోలింగ్ రోజున 42,446 మంది 67.4 శాతం ఓటేశారు. కోనసీమ జిల్లాలో 64,471 మంది ఓటర్లు ఉన్నారు. 47,125 మంది 73.09 శాతం ఓటేశారు. పురుషులు 27,450 మంది, మహిళలు 19,850 మంది, ఇతరులు ఒకరు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాకినాడ జిల్లాలో 70,540 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు నమోదవగా ఇందులో 42,463 మంది పురుషులు, 28,072 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో పోలింగ్ రోజు 47,150 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 29,232 మంది పురుష ఓటర్లు, 17,918 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మెజార్టీ ఓట్లు కూటమి అభ్యర్థి పేరాబత్తులవైపే పడ్డాయి. మహిళా ఓటర్లయితే కూటమికి ఓట్లతో పట్టాభిషేకం చేశారు. కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లోను కూటమి అభ్యర్థి పేరాబత్తుల అనుహ్య మెజార్టీతో ముందుకు సాగారు. విజయానికి కావలసిన ఓట్లను తొలి ప్రాధాన్యత ఓట్లతోనే సొంతం చేసుకున్నారు. ఒకరకంగా చెప్పాలంటే కూటమి అభ్యర్థికి జిల్లా ఏకపక్షంగా అండగా నిలిచింది.



భౌ బోయ్!

- వీధివీధినా కుక్కలు
- భయం..భయంగా బయటకు
- కానరాని నివారణ చర్యలు

జనం బయటకు రావాలంటేనే భౌబోయ్ అంటూ భయపడుతున్నారు.. ఎందుకంటే వీధుల్లో కుక్కలు జనం పిక్కలు లాగేయడానికి సిద్ధంగా ఉంటున్నాయి. అవి దయతలిస్తేనే రోడ్డుపై జనం సంచరించే పరిస్థితులు దాపురించాయి. కుక్క కరవకుండా.. అరవకుండా ఇంటికి చేరుకున్నామంటే అదృష్టంగానే భావించాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో పిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నారు. కాళ్లూ, చేతులూ విరగ్గొట్టుకుంటున్న సంఘటనలు రోజూ ఉంటున్నాయి. ఇప్పుడు ఉష్ణోగ్రతలు ముదురుతుండడంతో కుక్కల్లో హీట్ స్ట్రెస్ వల్ల విపరీత ప్రవర్తన మరీ ఎక్కువ అవుతుంది. నీళ్లు, నీడ, ఆహారం దొరక్కపోవడంతో రెచ్చిపోతుంటాయి. ఏ మాత్రం తేడా వచ్చిందో కాటు తప్పదు. మరో వైపు రేబిస్ సోకిన కుక్కలు వీధుల వెంట కనిపిస్తూనే ఉంటున్నాయి.. అయినా పట్టించుకునేవారే లేరు.. కుక్కల నివారణకు చర్యలూ కానరావడం లేదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కుక్కల ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలనాత్మక కథనం. 6

రూ.27 అదనంగా వసూలు చేసినందుకు.. రూ.27 లక్షల భారీ జరిమానా!

» హైదరాబాద్ బోడుప్పల్‌లోని ట్యూలిప్స్ గ్రాండ్ హోటల్‌కు కాకినాడ వినియోగదారుల కమిషన్ షాక్ 7
» బాధితుడికి మరో రూ.27వేలు నష్టపరిహారం కూడా..

బయట నుంచి పోరాడతా.. పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవులు

తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలపై మండలిలో పోరాటం చేయాలని కోరారు. అయితే తనకు అవకాశం ఇవ్వలేదని, అయినా బయట నుంచి నిరుద్యోగుల సమస్యలపై ఇక పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి పాలైన పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు ఫలితం వెలువడిన తర్వాత మీడియాతో అన్నారు. చాలా ఎక్కువ సంఖ్యలో చెల్లని ఓట్లు తేలడం, కొంత పట్టభద్రుల్లో తొట్రుపాటు, ఒత్తిడి, అవగాహనలేమి కారణం అయి ఉండవచ్చు. రానున్నకాలంలో ఓటుపై మరింత అవగాహన కల్పిస్తానన్నారు.





మిగిలిన అభ్యర్థులతో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ విజేత పేరాబత్తుల రాజశేఖరం.. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పేరాబత్తుల రాజశేఖరం చిత్రంలో గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే రామరాజు

చెల్లని ఓట్లు 19,694

పట్టభద్రులు చెల్లని ఓట్లు వేశారు.. ఒక్కటో రెండో కాదండోయ్.. ఏకంగా 19,694 ఓట్లు చెల్లుబాటు కాలేదు.. మొత్తం 3,14,984 ఓట్లు ఉండగా 2,18,902 ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. వీటిలో లెక్కింపబడిన మాత్రం 1,99,208 ఓట్లే.



చంద్రబాబును నమ్మారు.. నన్ను గెలిపించారు

ఎమ్మెల్సీగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖరం

కూటమి ప్రభుత్వం 8 నెలల్లో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులు నమ్మారు.. అందుకే తనను మెజార్టీతో గెలిపించి మండలికి పంపే అవకాశం ఇచ్చారని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. ఫలితం ప్రకటించిన వెంటనే మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనను నమ్మి గెలిపించిన పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటానని, అందరికి అందుబాటులోకి ఉంటానన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో చంద్రబాబు రాష్ట్రాన్ని బాగు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారని, తాను కూడా తనవంతు పాత్ర పోషిస్తానన్నారు. కుటుంబ సభ్యులతో పేరాబత్తుల విజయాన్ని పంచుకున్నారు. అభిమానులు బాణసంచా పేల్చి హర్షం వ్యక్తంచేశారు.

ప్రశాంతంగా ప్రథమ ఇంటర్ ఆంగ్ల పరీక్ష

కాకినాడరూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో మంగళవారం ఇంటర్మీడియట్ ప్రథమసంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల పరీక్షను నిర్వహించారు.ఈ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో నూకరాజు తెలిపారు. ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ జిల్లావ్యాప్తంగా 56 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయన్నారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ విభాగాల్లో మొత్తం 24,042మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 23,175మంది పరీక్షలకు హాజరుకాగా 867 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదన్నారు. బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆంగ్ల పరీక్ష జరుగుతుందని డీఐఈవో తెలిపారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం మహిళాదినోత్సవం నిర్వహణకు సంబంధించి ఐసీడీఎస్, జడ్పీ, పంచాయతీ తదితరశాఖల అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అన్నిశాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఐసీడీఎస్ పీడీ విజయ్‌కుమారి, డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసరావు, డీఎం అండ్ హెచ్‌వో నరసింహనాయక్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీవో రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

'సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల సర్వే వేగవంతం చేయాలి'

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థితిగతులపై క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వేను వేగవంతం చేసి ఈనెల 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. వేసవి కార్యాచరణ ప్రణాళిక, వర్క్‌ఫ్రంహోం, ఎంఎస్ఎంఈ, గ్రామ, వార్డు సచివాలయాల హౌస్‌హోల్డ్ సర్వేల పురోగతిపై కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం పంచాయతీ, వైద్యఆరోగ్యం, పరిశ్రమల తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో జరిగే ఎంఎస్ఎంఈ సర్వేద్వారా వ్యాపారాలకు సంబంధించి ప్రతి షాపు, పరిశ్రమలనుంచి పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేసి ప్రత్యేక యాప్‌లో సర్వే వివరాలను నమోదు చేయాలన్నారు.ఈజిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వేకు సంబంధించి 78,299లక్ష్యంగా ఇప్పటివరకు 73,330 పూర్తిచేశారన్నారు.మిగిలిన సర్వేప్రక్రియను వేగవంతం చేసి మార్చి15నాటికి పూర్తిచేయాలన్నారు. జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీవో రవికుమార్, డీఎంహెచ్‌వో నరసింహనాయక్,పరిశ్రమలశాఖ డీఎం గణపతి,ఆర్డబ్ల్యూఎస్ఈఈ భారతిపాల్గొన్నారు.



భౌ బోయ్!

ఏ వీధి చూసినా కుక్కల స్వైరవిహారం.. జనం గగ్గోలు
ఆస్పత్రికి రోజూ వందలాది మంది కుక్క కాటు బాధితులు
ఏబీసీ శస్త్ర చికిత్సలే శరణ్యం.. అవీ అరకొరే



(పిఠాపురం/ముమ్మిడివరం/మలికిపురం/అంతర్వేది/ఆత్రేయపురం/కపిలేశ్వరపురం/గండేపల్లి/ఏలేశ్వరం/కొవ్వూరు-ఆంధ్రజ్యోతి)

ఏ వీధి చూసినా కుక్కల స్వైరవిహార దృశ్యాలే. అటు వైపు వెళ్లిన వారిని చూసి మొరగడమో, లేదా ఒక్కసారిగా మీదపడి దాడి చేయడమో నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లల మీద పడి కుక్కలు దాడి చేస్తున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఎక్కడ నుంచి ఏ కుక్క వచ్చి మీద పడి కాటు కరుస్తుందో తెలియదు. రాత్రి వేళల్లో అయితే మరీ దారుణం. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు మీదకు వచ్చేందుకే సాహసించడం లేదు. వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి మరీ కరుస్తున్నాయి. ఇటీవల చిన్న పిల్లలపై దాడి చేసి మరీ కరుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కుక్కల బెడదపై జనం గగ్గోలు పెడుతున్నారు. కుక్కకాటుకు గురై ప్రభుత్వాసుపత్రులు, పీహెచ్‌సీలకు వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎన్ని నియంత్రణ చర్యలు చేపట్టినా చట్టపరంగా ఉన్న ఇబ్బందులతో అధికారులు ముందడుగు వేయలేకపోతున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి ప్రతీ రోజూ సగటున 15-35 మంది కుక్కకాటుకు గురై చికిత్స నిమిత్తం వస్తున్నారంటే ఇక్కడ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో విదితమవుతుంది. పిఠాపురమే కాదు పీహెచ్‌సీలకు వచ్చే కుక్కకాటు బాధితుల సంఖ్య కూడా అన్నిచోట్లా అధికంగానే ఉంటోంది. వాస్తవానికి కుక్కకాటుకు గురైన వ్యక్తికి ఐదు డోసుల ఏఆర్‌వీ వ్యాక్సిన్ చేయాల్సి ఉంటుంది. ఈ వ్యాక్సిన్ ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయించుకోవాలంటే రెండు వేల రూపాయల వరకూ వ్యయం అవుతుంది. అన్ని ప్రభుత్వాసుపత్రులు, పీహెచ్‌సీల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉండడంతో కొంత ప్రజలకు ప్రయోజనకరంగా ఉంది.

జంతువులనూ వదలడం లేదు..

ఇక పిచ్చికుక్కలతో జనం భయభ్రాంతులవుతున్నారు. అవి మనుషులతోపాటు జంతువులనూ వదలడం లేదు. మేకలు, కోళ్లు, గొర్రెలు, పశువులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. వీటిలో తీవ్రంగా గాయపడిన జంతువులు మృత్యువాత పడుతున్నాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, చినజగ్గంపేట, దుర్గాడ, పిఠాపురం మండలం విరవ, విరవాడ, కోలంక తదితర ప్రాంతాల్లో కొంతకాలంగా జరిగిన కుక్కలదాడిలో పలు గొర్రెలు, మేకలు, దూడలు మృత్యువాతపడ్డాయి. ఇటు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో ఏ వీధిలో చూసిన కుక్కలు సైర్వ విహారం చేస్తున్నాయి. దీనిపై కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పట్టణంలో 377 కుక్కలను గుర్తించామని, వాటికి శస్త్రచికిత్సలు చేయించడానికి చర్యలు చేపట్టామన్నారు.

నియంత్రణలో అన్నీ ఇబ్బందులే..

కుక్కలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు చట్టపరంగా ఉన్న ఇబ్బందులు అధికారులను ముందుకు కదలనివ్వడం లేదు. కుక్కలను గతంలో గ్రామపంచాయతీలు, పురపాలకసంఘాల ఆధ్వర్యంలో పట్టుకుని సంహరించేవారు. పరిస్థితులకు అనుగుణంగా ఆయా స్థానిక సంస్థలు చర్యలు చేపట్టడంతో ఇబ్బందులు ఉండేది కాదు. జంతుప్రేమికులు కోర్టును ఆశ్రయించడంతో వాటిని చంపడానికి వీలులేదు. దీంతో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. 2023లో అమలులోకి వచ్చి జంతు నియంత్రణ నిబంధనల ప్రకారం శునకాల సంఖ్య పెరగకుండా ఉండేందుకు సంతానోత్పత్తి నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇందుకు నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఉన్న అన్ని కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించాల్సి ఉంటుంది. అదే సమయంలో అవి కరిచినా రేబిస్ వ్యాధి వ్యాపించకుండా ఉండేందుకు వాటికి రేబిస్ వాక్సినేషన్ చేయాలి. ఈ బాధ్యత స్థానిక సంస్థలపై ఉంది. ఒక్కో శునకానికి సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స చేసి వాక్సినేషన్ చేయించేందుకు రూ.1700 వరకు వ్యయం అవుతుంది. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో 600 నుంచి 800 కుక్కలు ఉంటాయని అంచనా. వీటికి కు.ని. చికిత్స, వ్యాక్సినేషన్ చేసే ప్రక్రియను ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించారు. అది మొదలు కావాల్సి ఉంది. కుక్కల సంతానోత్పత్తి నియంత్రణపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ మాట్లాడుతూ కుక్కల నియంత్రణకు యాంటీ బర్త్‌కంట్రోల్ ఆపరేషన్, యాంటీరేబిస్ వ్యాక్సిన్ వంటి వాటిని వేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసినట్టు చెప్పారు. ఇక అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో కుక్కలకు యాంటీ బర్త్‌కంట్రోల్ ఆపరేషన్ నిర్వహించేందుకు థియేటర్ నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కుక్కల నియంత్రణకు సంబంధించి కాకినాడలోని స్వచ్ఛంద సంస్థను సంప్రదిస్తున్నారు. ఈ ఆపరేషన్ల కోసం ఒక్కొక్క కుక్కకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. ఆపరేషన్ చేస్తున్న కుక్కను ఏడు రోజుల పాటు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

వేసవి ప్రవేశించడం, ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో సాధారణ సమయాల్లో కంటే ఇప్పుడు కుక్కకాటుకు గురయ్యే వారి సంఖ్య ఏటా పెరుగుతుంది. వేడి వాతావరణంతో వాటికి చెమట పట్టక ఎండతీవ్రత తట్టుకోలేక కుక్కలు విచక్షణారహితంగా మీద పడి కరుస్తాయని పశువైద్యులు చెబుతున్నారు. దీంతో రోడ్లపై తిరిగే వారు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వ్యాక్సినేషన్‌తోపాటు గ్రామాలు, పట్టణాల్లో కుక్కల నియంత్రణపై అధికార యంత్రాంగంతోపాటు స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 5 వేల కుక్కలు

660 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో కుక్కల బెడద మామూలుగా లేదు. రాత్రి వేళ ఏ రోడ్డులోకి వెళ్లినా మీద పడే స్థాయిలో కుక్కలు అలజడి సృష్టిస్తున్నాయి. స్మార్ట్ సిటీగా ఉన్న కాకినాడలో ఈ కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కకాటు బాధితులు నిత్యం పెద్దసంఖ్యలో ఆసుపత్రులకు వెళుతున్నారు. కాకినాడ నగరంలో సర్వే ప్రకారం గుర్తించిన ఐదువేల కుక్కల్లో ఇప్పటికే 660 కుక్కలకు యాంటీ యానిమల్ బర్త్ కంట్రోల్, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ ప్రోగ్రాం కింద ఆపరేషన్లు చేశామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్ తెలిపారు. మిగిలిన కుక్కలకు ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. కుక్కలపై వచ్చే ఫిర్యాదుల మేరకు తమ సిబ్బంది వాటిని పట్టుకుని ఏబీసీ సెంటర్లో పరీక్షలు నిర్వహించి, రేబిస్ లేని కుక్కలను ఆయా ప్రాంతాల్లో విడిచిపెడతామన్నారు.

ఇవీ సంఘటనలు..

- ఫిబ్రవరి 17వ తేదీ సాయంత్రం పిఠాపురం పట్టణంలోని మంగాయామ్మరావుపేట, చిట్టోడితోట తదితర ప్రాంతాల్లో వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులతోపాటు పాఠశాలల నుంచి తిరిగి వచ్చే విద్యార్థులు, రహదారిపై వెళ్లే వారిపై పిచ్చికుక్క దాడి చేసి కరవడంతో 20 మందికి గాయాలయ్యాయి. వీరిలో కొందరిని తొడపై, చేతులు, ముఖంపై కరవడంతో ఏఆర్‌వీతో పాటు ఖరీదైన మరో ఇంజక్షన్‌ను చేశారు.
- నెలన్నర కిందట గొల్లప్రోలు పట్టణంలోని పలు వీధుల్లో పిచ్చికుక్క కరవడంతో 15 మందికి గాయాలయ్యాయి. వీరికి గొల్లప్రోలు పీహెచ్‌సీ, పిఠాపురం ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స అందించారు.
- కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో కుక్కకాటు బాధితులు రోజురోజుకీ పెరుగుతున్నారు. గడిచిన రెండు నెలల కాలంలో మండలంలో 86 కుక్కకాటు కేసులు నమోదైనట్టు సమాచారం.
- మలికిపురం మండల పరిధిలో జనవరి నెలలో తూర్పుపాలెంలో ఏడుగురిని పిచ్చికుక్క కరవగా రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. లేగ దూడలపై కూడా కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఇదే మండలంలో లక్కవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ భావనను తెలిపిన వివరాల ప్రకారం నెలకు 50 మంది కుక్కకాటుకు గురవుతున్నారు. ఫిబ్రవరిలో 48 మందిని కుక్కలు కరవగా వ్యాక్సిన్ వేశారు.
- సఖినేటిపల్లి మండలంలో గత రెండు నెలలుగా సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి పీహెచ్‌సీల్లో 167 మంది కుక్కకాటుకు గురై టీకాలు వేయించుకున్నట్టు పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు. అంతర్వేది, మోరి, సఖినేటిపల్లి, రామేశ్వరం, గొంది, టేకిశెట్టిపాలెం, లంక ప్రాంతాల్లోని చాలామంది ప్రజలు కుక్కకాటుకు గురై ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- ఫిబ్రవరిలో ముమ్మిడివరం హైస్కూలు రోడ్డులో తొమ్మిదిమందిపై కుక్క దాడిచేసి గాయపరిచింది. జనవరిలో కొత్తలంక గ్రామంలో కుక్కల దాడికి ఆరుగురు తీవ్రగాయాలపాలయ్యారు. ముమ్మిడివరం బైపాస్‌రోడ్డులో కుక్కలు పశువులపై దాడిచేసి గాయపరిచాయి.
- కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఈనెల 2వ తేదీన పిచ్చికుక్క దాడి చేసి 15 మందిని గాయపరిచింది. వీరిలో తీవ్రంగా గాయపడిన పదేళ్ల బాలుడు మణికంఠ, రెండేళ్ల చిన్నారి కార్తికేయ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకుంటున్నారని ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు శైలజ తెలిపారు.
- ఆత్రేయపురం మండలం వాడపల్లిలో ఇటీవల ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఆరుగురిని గాయపరిచింది. ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామివారి క్షేత్రానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఆ సమీపంలోనే కుక్కల బెడదతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.
- కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద అధికమైంది. అంగర, కపిలేశ్వరపురం, టేకి, మాచర, కోరుమిల్లి, వెదురుమూడి, వల్లూరు తదితర గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాలు ఏటిగట్టును అనుకుని ఉండడంతో వేర్వేరు ప్రాంతాల నుంచి కుక్కలను తీసుకువచ్చి ఇక్కడ వదలడంతో అవి గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయని ఆయా గ్రామాల వారు వాపోతున్నారు. కుక్కల సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చట్టరీత్యా కుక్కలను చంపేందుకు వీలు లేకపోవడంతో ఏంచేయాలో తెలియని పరిస్థితి. వేరే చోటకి తీసుకెళ్లి వాటిని వదులుదామన్నా ఆ ప్రాంత జనం ఒప్పుకునే పరిస్థితి లేదని పలువురు తెలిపారు.



ఆత్రేయపురం మండలం వాడపల్లిలో గుంపులుగుంపులుగా శునకాలు

ఏబీసీ పనిచేస్తోందా...

కుక్కల సంఖ్య నియంత్రణకు యాంటీ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్స్‌ని చేస్తుంటారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజుకు ప్రస్తుతం 25 వరకూ ఏబీసీ చేస్తున్నామని చెబుతున్నారు. దీనికి ఒక్కో కుక్కకు రూ.1500 చొప్పున కార్పొరేషన్ ఖర్చు చేస్తోంది. ఇప్పుడు ఒకే ఆపరేషన్ థియేటర్ ఉండగా రెండు కుక్కలకు ఒకేసారి చేసే సదుపాయం ఉంది. ఈ నెలలోనే మరో థియేటర్ నిర్మించి ఆ ఏబీసీ సంఖ్యను రోజుకు 50కి పెంచే ఆలోచన చేస్తున్నారు. కరోనా సమయంలో 2019-2022 మధ్య ఏబీసీ ఆపేశారు. దాంతో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిందని అంచనా. అయితే 2023, 2024ల్లో ఆ సంఖ్యను అదుపులోకి తీసుకురావడానికి సీరియస్‌గా యాక్షన్‌లోకి దిగకపోవడమే ఇప్పుడు జనం ప్రాణాల మీదకు తెస్తుందనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక రోజులో పట్టుకున్న అన్ని కుక్కలకు ఆపరేషన్ చేయడం వీలుపడకపోవచ్చు. కుక్క నూడిదికావడం, ట్యూమర్లు ఉండడం, సర్జరీకి సహకరించకపోవడం కారణాల వల్ల ఏబీసీ చేయకుండా వదిలేయాల్సి రావచ్చు. పైగా ఎక్కడ నుంచి తీసుకెళ్లారో వాటిని అక్కడే వదిలేయాలి.

వెటర్నరీ ఎక్కడ?

రాజమహేంద్రవరం డివిజన్లో 10, కొవ్వూరు డివిజన్లో 9 వెటర్నరీ ఆస్పత్రులున్నాయి. ఇవి మండల కేంద్రాల్లో ఉంటాయి. వీటిలో సర్జరీలకు పరికరాలు అందుబాటులో ఉంటాయి. మండలానికి 3-4 వెటర్నరీ డిస్పెన్సరీలు ఉన్నా సర్జరీలకు అవసరమైన సామగ్రి ఉండదు. అయితే ఎక్కడా కూడా కుక్కల ఏబీసీపై దృష్టి సారిస్తున్నట్టు లేదు. కేవలం రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏబీసీలు చేయడంతో పెద్దగా ఉపయోగం ఉండడం లేదనే వాదన వినవస్తోంది. వెటర్నరీ శాఖ పట్టించుకోకపోవడంతో పంచాయతీ ఏరియాల్లో కుక్కల సంతతి విపరీతంగా వృద్ధి చెందుతోంది. గతంలో అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత ఆదేశాలతో రాజమహేంద్రవరం వెటర్నరీ ఆస్పత్రిలో ప్రతి ఆదివారం వీధి కుక్కలకు ఏబీసీ చేసేవారు. కొద్దివారాలపాటు కొనసాగించి తర్వాత నిలిపివేశారు. ముఖ్యంగా వాటిని తీసుకొచ్చి సర్జరీ తర్వాత తీసుకెళ్లి వదిలే ఏర్పాటు లేదని వెటర్నరీ అధికారులు చెబుతున్నారు. ఇది కూడా శునకాల సంతతి పెంపుదలకు దోహదం చేస్తోందనే విమర్శలు వినవస్తున్నాయి.

- రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి

పదిరోజుల్లో 292 కుక్కకాటు కేసులు



రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలోని క్లినిక్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కుక్కకాటు బాధితులు ప్రతిరోజూ రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి క్యూ కడుతున్నారు. బోధనాసుపత్రి క్యాజువాలిటీ విభాగం సమీపంలోని యానిమల్ బైట్ క్లినిక్‌కు ప్రతిరోజూ బాధితులు వస్తున్నారు. గత పదిరోజుల్లో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 292 మంది కుక్కకాటు బాధితులు ప్రభుత్వాసుపత్రిలో ఏఆర్‌వీ ఇంజక్షన్లు (వ్యాక్సిన్లు) చేయించుకోవడం గమనార్హం. ఇవన్నీ కొత్త కేసులు. వీరిలో మహిళలు, పిల్లలు, వృద్ధులు కూడా ఉంటున్నారు. ఏఆర్‌వీ డోసులు నెలలో నాలుగుసార్లు వేయాల్సి ఉంటుంది. కొత్త కేసులు ప్రతిరోజూ 30 నుంచి 35 వరకూ ఉంటున్నాయని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు. పాత వాటితో కలుపుకుంటే కేసులు 70 నుంచి 80 వరకూ ఉంటున్నాయి. కుక్క కరచిన గాయాలు ఎక్కువగా ఉంటే రిగ్ అనే మరో ఇంజక్షన్ కూడా ఇస్తున్నారు. దీన్ని కుక్క కరచిన 24 గంటల్లోగా చేయించుకోవాల్సి ఉంది. దీన్ని ఒకే డోసుగా వేస్తారు.

నెలాఖరుకు పన్నుల వసూళ్లు పూర్తి చేయాలి



- పట్టణాల్లో కుక్కల నియంత్రణకు నేహా ఏజెన్సీస్ సహకారం
- మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగ నరసింహారావు
- తూర్పు, కోనసీమ జిల్లాల మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష

నిడదవోలు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలో ప్రతి మున్సిపాలిటీలోను పన్నుల వసూళ్లను మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని, వాటిని వేగవంతం చేసేందుకు మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించామని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. మంగళవారం ఆయన తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పురపాలక సంఘాల పరిధిలో ప్రజలు ఆస్తి, నీటి పన్నులను త్వరగా చెల్లిస్తే అవి పట్టణాల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. మున్సిపాలిటీల్లో ప్రజలు తడి, పొడి చెత్తలను వేరు చేసి శానిటేషన్ సిబ్బందికి అందించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో కుక్కల సంతానోత్పత్తిని నివారించేందుకు నేహా ఏజెన్సీస్ ముందుకు వచ్చిందని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి కుక్కల సంతానోత్పత్తి పెరగకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రతి కమిషనర్లు తమ పరిధిలోని అన్న క్యాంటీన్లలో భోజన సదుపాయం, మంచినీరు పరిశుభ్రతకు ప్రాముఖ్యతనిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పురపాలక సంఘాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికార్లను ఆదేశించామన్నారు. రోజూ ఉదయం కమిషనర్, శానిటేషన్ సిబ్బంది వార్డుల్లో పర్యటించి ఫొటోలు అప్‌లోడ్ చేసేలా మానిటరింగ్ చేస్తున్నామన్నారు. తొలుత ఆర్డీ మున్సిపల్ కమిషనర్లతో సమావేశమయ్యారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కంపోస్టు యార్డు, పంప్ హౌస్ ప్రాంతాలను పరిశీలించారు. కమిషనర్లు టి.కృష్ణవేణి, టి.నాగేంద్రకుమార్, కేవీఆర్.రాజు, టీవీ రంగారావు, పి.రవివర్మ, ఐవీ నాయుడు పాల్గొన్నారు.



జర్మనీ ఎయిర్‌పోర్ట్‌లో మంత్రి దుర్గేష్‌కు స్వాగతం పలుకుతున్న తెలుగు ప్రజలు, జనసైనికులు

జర్మనీ పర్యటనకు మంత్రి దుర్గేష్

నిడదవోలు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జర్మనీలోని బెర్లిన్ ఎక్స్‌పో సెంటర్లో జరుగుతున్న ఐటీబీ బెర్లిన్-2025 సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున పాల్గొనేందుకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున ఆయనకు ఎన్ఆర్ఐలు, జనసైనికులు ఘనస్వాగతం పలికారు.



శిక్షణ పొందుతున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు





అకస్మాత్తుగా ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టే చర్యలను తెలియజేస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

విపత్తుల వేళ.... రక్షిస్తామిలా!

ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి డిజాస్టర్ రెస్క్యూ ఎక్విప్‌మెంట్ ట్రైనింగ్





సర్పవరం జంక్షన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, విపత్తుల సమయంలో ప్రజల ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అందిస్తున్న సేవలను వెలకట్టలేమని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు అన్నారు. కాకినాడ జిల్లా కాకినాడరూరల్‌లోని రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో రెండువారాలుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి డిజాస్టర్ రెస్క్యూ ఎక్విప్‌మెంట్ ట్రైనింగ్ (డీఆర్‌ఈటీ) ఇచ్చారు. మంగళవారం జరిగిన ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమాండెంట్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో వినియోగించి స్కిల్స్ పెంచుకోవాలన్నారు. విధులు, ఫిట్‌నెస్, ఎస్‌డీఆర్‌ఎఫ్ ఆవశ్యకత, ప్రమాదాలు, విపత్తుల సమయంలో అనుసరించాల్సిన విధానాలను సిబ్బందికి అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందనరావు వివరించారు. అనంతరం ఎస్‌డీఆర్‌ఎఫ్ స్టోర్, స్టాల్‌ని పరిశీలించారు. అధునాతన పరికరాలను చూసి పరీక్షించారు. అసిస్టెంట్ కమాండెంట్లు ఎం.మోహనరావు, బి.చంద్రశేఖర్, వి.రాము, ఆర్‌ఐ, ఎస్‌డీఆర్‌ఎఫ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



శిక్షణ అనంతరం ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గ్రూప్ ఫొటో

పక్షుల రెట్టలకూ కుర్చీలు!



రైల్వేస్టేషన్‌లో చెట్ల కింద పక్షుల రెట్టలతో అపరిశుభ్రంగా ఉన్న కుర్చీలు

ఆశ్చర్యపోకండి! విస్మయం చెందకండి!! మీరు చదివిన శీర్షిక కరెక్టే. ఈ ఫొటోను చూస్తుంటే విషయం మీకు అర్థమయ్యే ఉంటుంది. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్లో త్వరలో దక్షిణ మధ్య రైల్వే జీఎం తనిఖీలు ఉండడంతో పలు పనులను చురుగ్గా చేస్తున్నారు. పనికిరానివి, పనికొచ్చేవీ కూడా పక్కన పడేస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికులు కూర్చోవడానికి వినియోగించిన ఐరన్ కుర్చీలను తొలగించి స్టీలు కుర్చీలను ఎడాపెడా ఏర్పాటు చేశారు. తొలగించిన కుర్చీలను ఇలా చెట్టు కింద పడేయగా... పక్షులు రెట్టలు వేయడానికి వినియోగించుకుంటున్నాయి మరి!. స్వచ్ఛ భారత్‌ని పక్కనపెడితే... అసలు ఈ ప్రదేశం ఎప్పుడూ పక్షుల రెట్టలతో దుర్వాసన, దరిద్రంగా ఉంటుంది. ఇప్పుడు ఈ కుర్చీలు ఆ అపరిశుభ్రతను మరింత రెట్టింపు చేశాయి. రోజుకు 25వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే స్టేషన్లో.. అదీ రద్దీగా ఉండే ఒకటో ప్లాట్‌ఫామ్‌పై ఇదండీ సంగతి!!

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)



రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో చిందరవందరగా మూలనపడ్డ కుర్చీలు

30 గంటలు

సుదీర్ఘంగా ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్
30 గంటల తర్వాత ఫలితం ప్రకటన
ముగిసిన ఎన్నికల కోడ్

ఏలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజక వర్గ ఓట్ల లెక్కింపు కార్యక్రమం సుదీర్ఘంగానే కొనసాగింది. సోమవారం ఉదయం ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో 8 గంటలకు ప్రారంభమైన లెక్కింపు ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు గెలిచిన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఎన్నిక ధృవీకరణ పత్రం ఆర్వో కె.వెట్రిసెల్వి అందజేతతో ముగిసింది. 456 పోలింగ్ కేంద్రాల వారీగా స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను తీసుకువచ్చి, వాటిని కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన 28 టేబుల్స్‌పై వేసి కట్టలు కట్టే కార్యక్రమం ఏకబిగిన 12 గంటల పాటు సాగింది. ఉద్యోగ సిబ్బంది మూడు షిఫ్టుల్లో ఈ ప్రక్రియను చేపట్టారు. కట్టలు కట్టే కార్యక్రమం అన్ని టేబుల్స్‌పై ఒకే రీతిన సాగలేదు. దీంతో రౌండ్ రౌండ్‌కు అంతరం పెరిగి ఆలస్యం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఓట్లను 50 చొప్పున విభజించి కట్టలు కట్టే పనే సాగింది. అనంతరం 8.30 గంటలకు ఓట్ల లెక్కింపు తొలి రౌండ్ ప్రారంభం అయింది. అయితే ఓట్ల లెక్కింపులో అంకెలు, సరైన ఓట్లనే చెల్లనిగా ప్రకటించారంటూ ఏజెంట్లు పదేపదే అభ్యంతరాలు చెప్పడంతో తొలి రౌండ్ ఫలితం ఆలస్యంగా రాత్రి 12.30 గంటలకు విడుదల చేశారు. అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కూడా ప్రతీ ఓటును ఏజెంట్‌కు క్షుణంగా చూపించాల్సి రావడంతోనే జాప్యం చోటు చేసుకుంది. రాత్రి 3 గంటలకు రెండో రౌండ్ ఫలితం రాగా, 5 గంట లకు మూడో రౌండ్, 7 గంటలకు నాలుగో రౌండ్, 9 గంటలకు ఐదో రౌండ్, 11 గంటలకు ఆరో రౌండ్, మధ్యాహ్నం 1 గంట దాటాక 6 రౌండ్ ఫలితం విడుదలయ్యింది. ఇక్కడే పేరాబత్తుల రాజశేఖరం విజయం ఖరారైంది. చివరగా కొన్ని టేబుల్స్‌పైన ఓట్ల లెక్కింపును మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి చేశారు.


ఓట్ల స్లిప్పులను కట్టలుగా కడుతున్న కౌంటింగ్ సిబ్బంది


ఎన్నికలు సక్సెస్ కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు

అధికారులకు అభినందనలు

ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడంలో అందరూ అధికారులు అద్భుతంగా పనిచేశారని, అత్యంత నైపుణ్యంతో శాంతి యుతంగా చేయడం అభినందనీయమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి అన్నారు. ఆరు జిల్లాల యంత్రాంగం అందించిన సహకారం మరువలేనిదని, పోలీస్ యంత్రాంగం బాగా పనిచేసిందన్నారు. ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొని తమవంతు పాత్ర పోషించారన్నారు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు సజావుగా, ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల నిర్వహణ జరిగిన ప్రాంతాల్లో ఎన్నికల కోడ్‌ను ఎత్తివేస్తూ రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం ఉత్తర్వులు సాయంత్రం జారీ చేశారు. ఇక వివిధ విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగిపోనున్నాయి. అధికారిక కార్యక్రమాలు, పర్యటనలు సాగుతాయి. కౌంటింగ్ ప్రక్రియతో సోమవారం మూతపడిన మద్యం దుకాణాలు, బార్‌లు కూడా సాయంత్రం సీళ్లను తొలగించడంతో యధావిధిగా పనిచేశాయి.

ఈతకొడుతూ తిరిగిరాని లోకాలకు..

రాజస్థాన్‌లో బీటెక్ విద్యార్థి దుర్మరణం
స్వగ్రామం గొర్రిపూడిలో అంత్యక్రియలు

కరప, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి గండి సత్యనారాయణ (18) ఆదివారం ఉదయం రాజస్థాన్ రాష్ట్రం పిచోల జిల్లా ఉదయ్‌పూర్ సిటీలోని ఒక చెరువులో ఈతకొడుతూ ప్రమాదవశాత్తు దుర్మరణం చెందాడు. మృతుడి తండ్రి శివకుమార్, బంధువులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సత్యనారాయణ ఉదయ్‌పూర్‌లోని సర్ పదంపత్ సింఘానియా యూనివర్శిటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. 2వేల మందితో నిర్వహించిన 10కేఎమ్ మారథాన్‌లో పాల్గొని 21వ స్థానంలో నిలిచిన సత్యనారాయణ ఆదివారం ఉదయం జరిగిన 5కేఎమ్ వాక్‌థాన్‌లోనూ పాల్గొన్నాడు. అనంతరం హాస్టల్ వార్డెన్ అనుమతితో రాజమహేంద్రవరం, రాజస్థాన్‌లకు చెందిన ఇద్దరు మిత్రులతో కలిసి సత్యనారాయణ సైట్ సీయింగ్‌కు వెళ్లాడు. పిచోల చెరువులో ఈతకు దిగి రెండు రౌండ్లు ఈతకొట్టిన సత్యనారాయణ ఒడ్డున ఉన్న మిత్రులకు చెయ్యి ఊపి మళ్లీ మూడో రౌండుకు వెళ్లాడు. అయితే ఎంతకీ అతడు కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన మిత్రులు అక్కడే ఉన్న రెస్క్యూ టీమ్‌ను అప్రమత్తం చేశారు. అరగంట తరువాత చెరువు లోతులోని దట్టంగా ఊడల మాదిరి పెరిగిపోయిన నాచులో చిక్కుకుని ఆపస్మారకస్థితిలో ఉన్న సత్యనారాయణను ఒడ్డుకు తీసుకు వచ్చి సీపీఆర్ చేశారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. సత్యనారాయణకు ఈత బాగా వచ్చని, అయితే అత డు ధరించిన ట్రాక్ నీటికి బరువెక్కడంతో పా టు నాచులో చిక్కుకపోవడంతోనే మృతిచెందినట్టు అక్కడి పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సత్యనారాయణ మృతిచెందిన విషయం తెలుసుకుని అతడి తల్లిదండ్రులు కుప్పకూలిపోయా రు. మృతుడు సత్యనారాయణ, అతడి సోదరుడు కార్తికేయకు రైఫిల్ షూటింగ్‌లో మంచి ప్రావిణ్యం ఉంది. 2023 జనవరిలో ఆగ్రాలో జరిగిన జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్‌లో వారిద్దరూ బంగారు పతకాలను సాధించి సత్తా చాటారు. పోస్టుమార్టమ్, ఇతర లాంచనాలు పూర్తిచేసిన పిదప మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతదేహాన్ని కార్గో ఫ్లైట్‌లో వైజాగ్ తరలించి అక్కడ నుంచి మంగళవారం రాత్రి స్వగ్రామం గొర్రిపూడి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అందరితో కలివిడిగా ఉంటూ క్రీడలు, చదువులో ముందుండే సత్యనారాయణ అర్ధంతరంగా తనువు చాలించడంతో గొర్రిపూడి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

చోరీకి పాల్పడ్డ మహిళ అరెస్టు

బంగారు ఆభరణాలు స్వాధీనం

అమలాపురం టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో తోటి ప్రయాణికురాలిగా ఉండి చోరీకి పాల్పడిన మహిళను అరెస్టు చేసి 117 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు మంగళవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. గుంటూరు జిల్లా యడ్లపాడు గ్రామానికి చెందిన ఆవుల యశోద (32)ను అరెస్టు చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గత నెల 17న విశాఖ జిల్లా కూర్మనపాలేనికి చెందిన దుర్గమ రామకృష్ణ భార్యతో కలిసి కాకినాడ ఆర్టీసీ బస్టాండులో అమలాపురం నాన్‌స్టాప్ బస్ ఎక్కారు. రామకృష్ణ భార్య పక్క ఒక మహిళ కూర్చోగా ఆమె పక్కనే సూట్ కేస్ పెట్టుకున్నారు. ఆ మహిళ ముమ్మిడివరంలో బస్ దిగిపోయింది. అమలాపురం బంధువుల ఇంటికి వచ్చిన రామకృష్ణ సూట్‌కేస్ తెరచి చూడగా 117 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించి వెంటనే అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వీరబాబుతో పాటు క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్ నేతృత్వంలో పట్టణ ఎస్ఐ ఎస్ఆర్ కిశోర్‌బాబు, క్రైమ్ సిబ్బంది కేసును చేధించి ఆభరణాలను స్వాధీనం చేసుకోగా డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌తో పాటు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. చోరీకి పాల్పడిన యశోదను అమలాపురం కోర్టులో హాజరు పరచనున్నట్టు సీఐ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో పోలీసులు

'ఉద్యోగాలివ్వకుంటే ఓఎన్జీసీ పనులు అడ్డుకుంటాం'

అల్లవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేజీ బేసిన్ పరిధిలో చమురు నిక్షేపాల ఉత్పత్తుల్లో దేశంలోనే అగ్రగామిగా ఉన్న అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుంటే ఓఎన్జీసీ కార్యకలాపాలను అడ్డుకుని ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద రెండో రోజు మంగళవారం టీడీపీ, జనసేన నాయకులు ఆందోళన కొనసాగించారు. ఓడలరేవు గ్రామంలో అర్హులైన యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ నిరవధిక ఆందోళనకు దిగారు. ఓఎన్జీసీ టెర్మినల్‌లో ప్రధాన టాటా కంపెనీతో పాటు ప్రమోటెక్ కంపెనీ స్థానికుల ఉద్యోగాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, టీడీపీ నాయకులు కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, గండుమేను శ్రీనివాస్, మంతెన సురేష్‌రాజు, పెమ్మాడి వెంకటరామారావు, మందపాటి రామకృష్ణ, రేకాడి శేషగిరి, జనసేన నాయకులు గుత్తం కృష్ణ, పిండి గణపయ్య, నల్లా రాము, కటికిరెడ్డి బాబి ఓఎన్జీసీ సైట్ వద్ద ఆందోళన చేశారు.

రూ.27 అదనపు వసూలుకు
రూ.27 లక్షల భారీ జరిమానా

కాకినాడ క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ కన్నా అదనంగా రూ.27 వసూలు చేసినందుకు కాకినాడ వినియోగదారుల కమిషన్ రూ.27 లక్షలు భారీ జరిమానా వడ్డించింది. కమిషన్ బెంచ్ తరపున అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంతకుమార్, చక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు ఈ విధంగా తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లికి చెందిన నున్న కుసుమ కళ్యాణ్ 2023, డిసెంబరు 8న హైదరాబాద్ బోడుప్పల్‌లో ఉన్న ట్యూలిప్స్ గ్రాండ్ హోటల్‌లో బిర్యానీలు, డ్రింకులు, మూడు మినరల్ వాటర్ బాటిల్స్ కలిపి రూ.3,083 జొమాటో డైనింగ్ పే ద్వారా చెల్లించి కొనుగోలు చేశారు. హోటల్ యాజమాన్యం రూ.20 ఎమ్మార్పీ గల వాటర్ బాటిల్‌ను ఒక్కొక్కటి రూ.29కి విక్రయించింది. మూడింటికి రూ.60కి బదులు రూ.87 వసూలు చేయడాన్ని కళ్యాణ్ గుర్తించి హోటల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో బాధితుడు తన న్యాయవాదిద్వారా నోటీసులు పంపినా హోటల్ యాజమాన్యం స్పందించకపోవడంతో కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. అనంతరం కమిషన్ వారి సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకుని హోటల్ ట్యూలిప్స్ గ్రాండ్ నిర్వాహకులు దాహం తీర్చుకునే నీళ్ల బాటిల్‌పై వినియోగదారుడిపై అదనంగా రూ.9 భారం వేయడం అనైతికమని నిర్ణయించింది. ఈ రకంగా సమాజంలో వినియోగదారులను అన్యాయంగా దోచుకోవడం పరిపాటి అయినందున బాధితుడు కళ్యాణ్‌కు హోటల్ యాజమాన్యం రూ.25వేల నష్టపరిహారం, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.2వేలు చెల్లించడంతోపాటు తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ.27లక్షల భారీ జరిమానా చెల్లించాలని కమిషన్ తీర్పు ఇచ్చింది.

కాకినాడలో భారీ పేలుడు
క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స

కాకినాడ క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జగన్నాధపురం, జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో సోమవారం జరిగిన భారీ పేలుడు సంఘటనలో గాయాలపాలైన క్షతగాత్రులకు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స కొనసాగుతుంది. అయితే మంగళవారం మంగళగిరి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టి పలు నమూనాలను సేకరించింది. ఆ నివేదిక ఆధారంగా పోలీస్‌శాఖ తదుపరి చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివక్షత లేని సమాజం వైపు అడుగులు

● 'నన్నయ' వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ ● ఘనంగా ప్రారంభమైన నారీఫెస్ట్


సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ


ఫ్యాషన్ షోలో పాల్గొన్న విశ్వవిద్యాలయం విద్యార్థులు

దివాన్‌చెరువు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు గతంలో ఎన్నో వివక్షతలను ఎదుర్కొనేవారని, నేటి సమాజంలో కొంత మార్పు వచ్చిందని, భవిష్యత్‌లో వివక్షత లేని సమాజం వైపు అడుగులు వేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం తూర్పుగోదావరి జిల్లా నన్నయ విశ్వవిద్యాలయంలో నారీఫెస్ట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆకాశంలో సగం, అవకాశంలో సగం మాత్రమే కాకుండా ఆదరించడంలో కుడా సగం కావాలన్నారు. మహిళలు ఆదరణను కోరుకుంటారని, ఆ ఆదరణ తల్లిదండ్రులు, జీవితభాగస్వామి, పిల్లలు, గురువులు, స్నేహితులు, సన్నిహితుల నుంచి లభిస్తుందన్నారు. మనిషికి ఎన్ని డిగ్రీలు ఉన్నా ప్రేమ, అనురాగం, ఆప్యాయత, ఆదరణ, మానవవిలువలు లేకపోతే వృథా అన్నారు. విశ్వవిద్యాలయంలో మామ్మ మనవరాలు ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామన్నారు. బంధంతోబాటు సంస్కృతీ సంప్రదాయాలు మామ్మతరం నుంచి మనవరాలు తరం వరకూ కొనసాగాలనే ఉదేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పెద్దవారిని ఎప్పటికీ గౌరవించాలని అనాథ ఆశ్రమాలు లేని సమాజం వైపు సయనించాలని సూచించారు. వివిధ కేటగిరిలకు చెందిన మహిళలు, బాలలను వేదికపైకి పిలిచి బుడగలు వదిలి పోటీలు ప్రారంభించారు. విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలు, స్థానిక మహిళలు హాజరయ్యారు. స్థానిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం మహిళాసెల్ కోఆర్డినేటర్ పి.ఉమామహేశ్వరీదేవి, అధ్యాపకులు వి.పెర్సిస్, ఎన్.సజనరాజ్, కె.దీప్తి, డి.లత, బి.వి జయకుమారి, ప్రత్యేక సలహా కమిటీ సభ్యులు డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, కె.సుబ్బారావు, కె.నూకరత్నం, పద్మావతి,కె.రమణేశ్వరి ఉన్నారు.

'సూర్యఘర్'పై విస్తృత ప్రచారం నిర్వహించాలి

సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ
ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

అమలాపురం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు చౌకగా సోలార్ విద్యుత్‌ను అందించే విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కోనసీమ జిల్లా భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ బిల్లుల బకాయిలు, వసూళ్లపై సమీక్షించారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు కేంద్రం అందిస్తున్న రాయితీపై అవగాహన కల్పించడం ద్వారా సోలార్‌విద్యుత్ వాడకాన్ని పెంపొందించి ప్రజలకు తక్కువ ధరకు విద్యుత్ అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా వేసవి సీజన్‌లో ఎక్కడా లోఓల్టేజీ సమస్య లేకుండా చూడాలని, ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్ అయితే గుర్తించి అందుకు తగిన యాక్షన్ ప్లాన్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సర్కిల్ పనితీరును సమీక్షించారు. తొలుత ఈదరపల్లిలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ పరిధిలోని ఆపరేషన్ సర్కిల్‌లో లైన్‌మెన్స్ దివస్‌ను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పృథ్వీతేజ్ పాల్గొన్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనాలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ ఎస్.నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.రాంబాబు, కె.రత్నాలరాజు, సీనియర్ అక్కౌంట్ ఆఫీసర్ కె.సత్యకిశోర్, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.


అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలో లైన్‌మెన్ దివస్ కార్యక్రమంలో పలువురిని సత్కరించిన సీఎండీ పృథ్వీతేజ్

గణేష్‌కు దివాస్ అవార్డు

చింతూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కణితి గణేష్ లైన్‌మెన్ దివాస్ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖ సర్కిల్ చింతూరు సబ్‌స్టేషన్ పరిధిలో గణేష్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) లైన్‌మెన్ దివాస్ అవార్డులను ప్రకటించింది. నిబద్ధత, త్యాగం, సేవా గుణాలను ప్రదర్శించిన విద్యుత్ ఉద్యోగులకు ఈ అవార్డులను అందజేస్తుంటుంది. ఇందులోభాగంగా మంగళవారం సీఈఏ నేతృత్వంలో ఎంపికైన ఉద్యోగులకు ఢిల్లీలో అవార్డులు అందించి సన్మానించారు. ఈ క్రమంలో గణేష్ లైన్‌మెన్ దివాస్ అవార్డుతోపాటు ఉత్తమ ప్రతిభ కనబర్చిన అవార్డును కూడా దక్కించుకున్నారు. వరదల సమయంలో సాధ్యా సాధ్యాలను పరిగణనలోకి తీసుకొని వినియోగ దారులకు విద్యుత్ సరఫరా అందించడంలో గణేష్ సాహసంతో కూడిన ప్రతిభను కనబర్చి నందునే అవార్డుకు ఎంపికయ్యారు. సీఎండీ, ఎస్ఈ, డీఈ, ఎడిఈలతో పాటు చింతూరు వాసులు గణేష్‌కు అభినందనలు తెలిపారు.


ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న కణితి గణేష్

అక్రమ మద్యం ధ్వంసం

ద్రాక్షారామ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం సబ్ డివిజన్‌లో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన రూ.15 లక్షలు విలువైన అక్రమ మద్యాన్ని మంగళవారం ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.అమర్‌బాబు, డీఎస్పీ బి.రఘువీర్ ఆధ్వర్యంలో ద్రాక్షారామ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో మంగళవారం డీపీఎల్ 351 లీటర్లు, ఎన్ డీపీఎల్ 511.85 లీటర్లు, ఐడీఎల్ 1809 లీటర్లు వెరసి 446 కేసులు, 2672 బాటిల్స్‌ను రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కార్యక్రమంలో మండపేట సీఐ దొరరాజు, రామచంద్రపురం ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు, ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్, కె.గంగవరం ఎస్ఐ జానీబాషా, మండపేట ఎస్ఐ సురేష్‌బాబు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు రోలర్‌తో మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

దుప్పి, అడవి పంది మాంసం అమ్మకాలు

అల్లవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో లభ్యమయ్యే దుప్పి(జింక) మాంసం, అడవి పంది మాంసాలు కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరి మార్కెట్‌లో వారానికి ఒకరోజు బహిరంగంగా విక్రయిస్తున్నారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచి మాంసాలను తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ అమ్మకాలను అటవీశాఖ, పోలీసుశాఖలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు

ఎక్సైజ్ అధికారుల సమక్షంలో షాపు సీజ్, ముగ్గురిపై కేసు

కొత్తపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల మారుతీ వైన్స్ వద్ద మంగళవారం ఎక్సైజ్ అధికారుల సమక్షంలో హైడ్రామా జరిగింది. వివరాల ప్రకారం... ఎమ్మెల్సీ కౌంటింగ్ నేపథ్యంలో మద్యం షాపులను సోమవారం ఉదయం నుంచి సీజ్ చేశారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు అమ్మకాలు జరపడానికి వీలు లేదంటూ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా పలివెల మారుతీ వైన్స్‌లో ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసినప్పటికి వెనుక నుంచి డోర్ తీసి మద్యం అమ్మకాలు చేస్తున్నారన్న సమాచారంతో సీఐ క్యాత్యాయని ఆధ్వర్యంలో సిబ్బంది షాపు వద్దకు చేరుకున్నారు. అప్పటికే షాపు నుంచి మద్యం కొనుగోలు చేసుకుని తీసుకువెళ్తున్న వ్యక్తిని 28 బాటిల్స్‌తో అదుపులోకి తీసుకున్నారు. తలుపులకు తాళాలు వేయించడంతో షాపులో ఇద్దరు అమ్మకందారులు ఉండిపోవడంతో కేకలు వేయగా షాపు సీజ్ తొలగించి వారిని బయటకు తీసుకువచ్చారు. మళ్లీ యధావిధిగా సీఐ సమక్షంలో సిబ్బంది షాపు సీజ్ చేశారు. అయితే షాపుపై ఏ చర్యలు చేపట్టకుండా షాపు ఎదురుగా 28 బాటిల్స్‌తో బెల్ట్ షాపు నడుపుతున్నట్టు నల్లా వెంకట్రావుపై కేసు నమోదు చేయడంతోపాటు షాపులో ఉన్న యడ్ల ఆనందకుమార్, ఎం.సాయిసతీష్‌లపై కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన మారుతీ వైన్స్‌పై చర్యలు ఏమైనా తీసుకుంటారా అని ప్రశ్నించగా సమాధానం దాటి వేసి ముగ్గురుపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.


పలివెలలో మద్యం షాపు సీజ్ చేస్తున్న అధికారులు

క్లాప్‌మిత్ర వేతన బకాయిల చెల్లింపునకు చర్యలు

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

పిఠాపురం రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరం గ్రామ పంచాయతీలో క్లాప్‌మిత్రగా పనిచేసిన కాటూరి లోవసత్తిబాబుకు వేతన బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పిఠాపురం ఎంపీడీవో బి.చిన్నారావు తెలిపారు. పి.రాయవరం సచివాలయంలో సత్తిబాబు పెట్రోల్ సీసాతో హల్‌చల్ చేసి సిబ్బందిపై పెట్రోల్ పోసి నిప్పంటిస్తానని బెదిరించిన ఘటనపై 'పెట్రోల్ పోసి నిప్పంటిస్తా' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీవోను పాడా ప్రాజెక్టు డైరెక్టర్ వివరణ కోరారు. పంచాయతీ కార్యదర్శి ఇప్పటికే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎంపీడీవో తెలిపారు. సత్తిబాబు 12 నెలలపాటు క్లాప్‌మిత్రగా పనిచేయగా, అతడికి రావాల్సిన రూ.72వేల వేతనానికి ఇప్పటికే రూ.56వేలు చెల్లించామన్నారు. బోర్ ఆపరేటర్‌గా పనిచేసిన మూడు నెలల కాలానికి రూ.9వేలు చెల్లించామని తెలిపారు. క్లాప్‌మిత్ర వేతన బకాయిలను పంచాయతీ పాలకవర్గం ఆమోదం అనంతరం నిధుల లభ్యత ఆధారంగా చెల్లిస్తామని చెప్పారు.

అన్నవరం దేవస్థానంలో మరమ్మతులు పరిశీలించిన అధికారుల బృందం

అన్నవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఇంజనీరింగ్ విభాగం ద్వారా త్వరలో చేపట్టబోయే పనులకు సంబంధించి దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దేవదాయ కమిషనర్‌కు లేఖ రాయడంతో మంగళవారం దేవదాయశాఖ సాంకేతిక సలహాదారు ఆర్.కొండలరావు, ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ శేఖర్ తదితరుల బృందం పరిశీలించింది.సీతారామసత్రం తొలగింపు పనుల అంచణాలు, కొత్త, పాత సెంటినరీ ప్రకాష్‌సదన్ కాటేజీలలో మరమ్మతులు చేపట్టాలని దేవస్థానం నిర్ణయించగా దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేసింది. దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి విచ్చేసిన బృందం మరమ్మతులు, నూతన పనులను దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం రూపొందించిన అంచనాలను పరిశీలించింది. ముందుగా స్వామిని దర్శించుకుని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, రాంబాబు,ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ నోడల్ సంస్థగా 'ఆదిత్య'

గండేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, యానాం జిల్లాల స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025 నిర్వహించడానికి నోడల్‌సంస్థగా ఆదిత్య యూనివర్శిటీని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఎంపిక చేసిందని యూనివర్శిటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో 18 నుంచి 25 ఏళ్ల పూర్తయిన వారు పాల్గొనవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా మైభారత్‌డాట్‌జీఓవిడాట్‌ఇన్ పోర్టల్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మైభారత్ పోర్టల్‌లో కాకినాడ జిల్లాగా ఎంచుకోవాలని, రాజ్యాంగం ద్వారా గుర్తింపు పొందిన ఏభాషలోనైనా వాట్ డజ్ వికసిత్ భారత్ మీన్ టు యూ అనే అంశంపై ఒక నిమిషం కలిగిన వీడియో అప్లోడ్ చేయాలన్నారు. నమోదైన వారిలో 150మందిని స్క్రీనింగ్ చేసి వారికి ఆదిత్య యూనివర్శిటీలో పోటీలు నిర్వహించి 10మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి పంపుతారని జిల్లా యువజన అధికారి దూలం కిషోర్, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.రాంబాబు, ఐవి రామాంజనేయులు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నమోదుకు మార్చి 9 చివరి తేదీ అన్నారు. నమోదు ప్రక్రియలో సహాయం కోసం 7729990278, 9000156734 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రికెట్ బుకీలకు రిమాండ్

రాయవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం, రాజానగరం మండలం చక్రధారబందం గ్రామాల్లో ఈనెల 2వ తేదీ రాత్రి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ పట్టుబడిన ఆరుగురు క్రికెట్ బుకీలను అనపర్తి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినట్టు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు మంగళవారం తెలిపారు. ఆరుగురు నిందితులకు మెజిస్ట్రేట్ ఈనెల 18 వరకు రిమాండ్ విధించినట్టు ఆయన చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మండపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో మంగళవారం రైలుఢీకొని గుర్తు తెలియని 60 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. రైల్వేపట్టాలపై మృతదేహం పడి ఉందని, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో ఉంచామని పోలీసులు తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

160 మందితో జనసేన ఆహ్వాన కమిటీ

పిఠాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారు ఎస్బీ వెంచర్స్‌లో ఈ నెల 14న నిర్వహించే జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేసేందుకు, ఏర్పాట్ల పర్యవేక్షణకు ఆ పార్టీ అధినాయకత్వం తాజాగా ఆహ్వాన కమిటీ ఏర్పాటు చేసింది. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలకు చెందిన 160 మంది నాయకులు, జనసైనికులు, వీర మహిళలు సభ్యులుగా నియమిస్తూ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. 11 కమిటీలను ఆహ్వాన కమిటీ సభ్యులు సమన్వయం చేసుకుంటూ సభ విజయవంతానికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తారని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలు తెలిపాయి.



విద్యార్థులకు ప్రతిభా పత్రాలు, బహుమతులు అందజేస్తున్న డీఈవో రమేష్

'ప్రపంచాన్ని శాసిస్తున్నది, నడిపిస్తున్నది సైన్సే'

కాకినాడ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని శాసిస్తున్నది నడిపిస్తున్నది సైన్సే అనే డీఈవో పి.రమేష్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో వారం పాటు నిర్వహిస్తున్న సైన్స్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సాలిపేట పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించినట్టు జిల్లా సైన్స్ అధికారి ఎంఎస్ వినీల్ తెలిపారు. వివిధ పాఠశాలల నుంచి 94 మంది పాల్గొన్నారు. సైన్స్, క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో విజేతలకు ప్రతిభా పత్రాలను, బహుమతులను డీఈవో రమేష్ అందజేశారు. కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు జె.సుబ్బలక్ష్మి, సీహెచ్ నారాయణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఆంగ్లం ఒక సబ్జెక్టు కాదు ఒక భాష'

కాకినాడ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లం ఒక సబ్జెక్టు కాదు ఒక భాష అని రాజమహేంద్రవరం అక్నూ సీడీసీ డీన్ ప్రొఫెసర్ కేఎస్ రమేష్ అన్నారు. ఐడియల్ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో 'ఆర్ట్ అండ్ టెక్నిక్ ఆఫ్ కమ్యూనికేషన్' అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం మంగళవారం కొనసాగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ ఆంగ్లానికి సంబంధించిన భావాలు, ఆలోచనలు ఎదుటివారికి అర్థం కావాలంటే నిరంతర అధ్యయనం ద్వారా మాత్రమే సాధ్యపడుతుందన్నారు. కీనోట్ స్పీకర్‌గా వ్యవహరించిన కళాశాల కరస్పాండెంట్-కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా భాషా సామర్థ్యాన్ని పెంచుకోవడం చాలా అవసరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కన్వీనర్‌గా నానిబాబు, సహ కన్వీనర్‌గా రాజేష్ వ్యవహరించగా కృష్ణంరాజు, సుబ్బారావు, సిద్ధార్థబాబు, స్వరూప్, స్టీవెన్‌రాజు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రమేష్

సీతారామస్వామి ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు

కొత్తపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర్స గ్రామంలో ఆక్రమణకు గురైన శ్రీసీతారామస్వామి ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్టు దేవదాయ శాఖ జిల్లా అధికారి దుర్గాభవాని పేర్కొన్నారు. గోర్సలో సర్వే నెం.121,122ల్లో 19.92 ఎకరాలను పిఠాపురం మహారాజు సీతారామస్వామి ఆలయానికి కేటాయించారు. ఈ భూమిని పలువురు ఆక్రమించడం, ధూప, దీప, నైవేద్యాలకు డబ్బులు లేకపోవడంతో గ్రామస్తులు విరాళాలు సేకరించి పూజలు చేయించడం విదితమే. ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని గ్రామస్తులు దఫదఫాలుగా జిల్లా అధికారులు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో దేవదాయ శాఖ ఉప కమిషనరు రమేష్‌బాబు ఆదేశాలతో జిల్లా అధికారి దుర్గాభవాని, ఈవో ధనలక్ష్మి మంగళవారం ఆలయ భూములను పరిశీలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సంబంధిత పత్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గాభవాని మాట్లాడుతూ పూర్తి నివేదిక సమర్పిస్తామన్నారు. గోర్స సర్పంచ్ రొంగల వీరబాబు, అయినంపూడి సత్యనారాయణరాజు, ఎంపీటీసీ కొండపల్లి సూర్యనాగేశ్వరరావు, పెదిరెడ్ల త్రిమూర్తులు, కొరాని సూరిబాబు, ఆచారి, కొప్పిశెట్టి రామచంద్రరావు, గంధం సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయ భూములను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ జిల్లా అధికారి దుర్గాభవాని

అగ్నిమాపక శాఖ ఏడీ జిల్లా పర్యటన

కాకినాడ క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ నార్త్ రీజియన్ అడిషనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కాకినాడలోని జిల్లా ఫైర్ ఆఫీస్‌తో పాటు సాలిపేట అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక పరికరాలను పరిశీలించి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు పనితీరును మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఏడీ శ్రీనివాసులు మాట్లాడుతూ సాలిపేటలోని అగ్నిమాపక కేంద్రం బ్రిటీష్ కాలం నాటిదన్నారు. ఈ కేంద్రం స్థానంలో కొత్త భవంతి నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు.

కాకినాడ జిల్లాలో పరిశ్రమలు ఎక్కువ గా ఉన్న కారణంగా రసాయనాల వల్ల జరిగే అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కు వ ఉన్న నేపథ్యంలో త్వరలో కాకినాడకు హజ్మత్ వాహనాన్ని కేటాయిస్తామన్నారు. జగన్నాథపురం అగ్నిమాపక కేంద్రంలో మరమ్మతులు చేసేందుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఆయన వెంట జిల్లా అగ్నిమాపకాధికారి రాజేష్, ఫైర్ సిబ్బంది ఉన్నారు.

'ఎంఎస్ఎంఈతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి'

సర్పవరం జంక్షన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌లో భాగంగా కేంద్ర సహకారంతో ఎంఎస్ఎంఈ సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయ జనరల్ మేనేజర్ జీఎస్వీ రమణ కోరారు. మంగళవారం కాకినాడ రూరల్ తిమ్మాపురం ప్రజ్ఞ ఫంక్షన్ హాల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుకు వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, రాయితీలు, యూనిట్లు, ప్రాజెక్టు ప్రపోజల్స్ అంశాలను జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి వివరించారు. యూనియన్ బ్యాంకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను విశాఖ జోనల్ హెడ్ శాలిని మీనన్, ముంబై సెంట్రల్ ఆఫీస్ జీఎం జీఎస్వీ రమణ వివరించారు. ఎంఎస్ఎంఈలో యూనిట్లు స్థాపించిన పలువురు లబ్ధిదారులకు రాయితీ చెక్కులను పంపిణీ చేశారు. డీఆర్డీఏ పీడీ ఎ.శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్లు, మేనేజర్లు, రీజినల్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐఐపీటీ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

జేఎన్టీయూకే, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని ఐఐఐపీటీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఎస్ఎంఎస్ సెమినార్ హాల్లో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బెంగళూరులోని ఎడ్యుటెక్ సంస్థ కే12 టెక్నో సర్వీసెస్ కంపెనీ మంగళవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ మాట్లాడుతూ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులు బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్ (బీడీఎం)గా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని, వార్షిక వేతనం రూ.5లక్షల వరకు లభిస్తుందన్నారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు 40మంది విద్యార్థులు హాజరుకాగా 13 మంది ఎంపికైనట్టు తెలిపారు. కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ లేఖాశరణ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు ప్రారంభం

పిఠాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు ప్రక్రియ మంగవారం ప్రారంభమైంది. మహాశివరాత్రి, రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల సమయంలో లక్షల సంఖ్యలో భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. పలువురు పితృదేవతల మూసివాయినాలు(పిండప్రదానాలు) సమర్పించి వాటిని పుష్కరిణిలో కలపడంతో నీరు రంగుమారింది. దీంతో మోటార్ల సహాయంతో నీటిని తొలగిస్తున్నారు. నీరు పూర్తిగా తొలగించి పుష్కరిణిని శుభ్రపరిచిన అనంతరం కొత్తగా నీరు పెడతామని పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. అప్పటివరకు భక్తుల స్నానాల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు.





కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నలుకుర్తికి కేక్ తినిపిస్తున్న నేతలు, కాకినాడ రూరల్ వలసపాకలలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి దంపతులు

ఎమ్మెల్సీగా పేరాబత్తుల విజయంతో కూటమి నేతల సంబరాలు

కాకినాడ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పనితీరుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖరం, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఘన విజయాలు నిదర్శనమని టీడీపీ కాకినాడ రూరల్ కో-కన్వీనర్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సంబరాలు జరిపారు. నులుకుర్తి కేక్ కట్ చేసి నాయకులకు పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కొల్లాబత్తుల అప్పారావు, నాయకులు మాసుమేను గంగయ్య, గీసాల వెంకటేశ్వరరావు, బంగారు సత్యనారాయణ, కప్పల రాజు, రాయుడు శ్రీను, మేడిశెట్టి కృష్ణ, మాసుమేను శ్రీరాములు, బక్కి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించడం హర్షణీయమని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. పేరాబత్తులకు ఆయన అభినందనలు తెలుపుతూ పట్టభద్రులకు, కూటమి నేతలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించడంతో జనసేన నేతలు సంబరాలు జరుపుకున్నారు. చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద ఆ పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచుకున్నారు. పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పరిశీలకులు దాసరి రాజు, పీఎం రాజు, నాయకులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డిప్యూటీ సీఎం పవన్ నివాసం వద్ద జనసేన నేతల సంబరాలు

కరప (ఆంధ్రజ్యోతి): సిరిపురంలో మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుక నిర్వహించి పేరాబత్తులకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. రాజశేఖరం విజయంపై టీడీపీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, కరప మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకన్న ఆనందం వ్యక్తం చేశారు. సంబరాల్లో కూటమి నాయకులు అనిశెట్టి గంగాధర్, బోగిరెడ్డి కొండబాబు, బండారు మురళి, ముద్రగడ రమేష్, గంగాధర్, యాళ్ల పండు తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరం విజయంతో వలసపాకలలోని టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి దంపతుల నివాసంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి, నాయకులు త్రినాథరావు, బొజ్జ భవాని, పలివెల గాయత్రి, పాలిక ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. రమణయ్యపేటలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. మాజీ సీఎం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఆర్. సీతయ్యదొర, అడపా ప్రకాశ్‌నాయుడు, జంక్షన్ బాబ్జీ, వాసిరెడ్డి జ్యోతివీరకుమార్, ముమ్మిడి బ్రదర్స్ పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవులోని టీడీపీ కార్యాలయం బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. నేతలు టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, ధూళిపూడి వెంకటరమణ, వేగేశ్న భాస్కరరాజు, మోపూరి వెంకటేశ్వరరావు, విల్ల వీర, కొప్పనాతి దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాడలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

గొల్లప్రోలు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 'పొంగిపొర్లుతున్న డ్రైన్లు-పగటిపూటే విద్యుత్ వెలుగులు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ స్పందించారు. ఎంపీడీవో కర్రి స్వప్న, ఈవోపీఆర్డీ కుమార్‌లతో మాట్లాడారు. దుర్గాడలో పారిశుధ్య మెరుగుకు తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి సెలవును రద్దు చేసి తక్షణం విధులకు హాజరు కావాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఎంపీడీవో తెలిపారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

పెద్దాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చెరువులను అభివృద్ధి చేయాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అధికారులను ఆదేశించారు. మండలంలోని కట్టమూరులో రాయన్న చెరువు అభివృద్ధి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఉపాధి వేతనదారులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అందరికీ పనులు కల్పించాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం గ్రామాల్లో గోకులం పథకం ద్వారా నిర్మించిన పశువుల షెడ్లను, రహదారుల అభివృద్ధి పనులను వెంకటలక్ష్మి పరిశీలించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఏపీవో డి.సుధీర్, జేఈ సతీష్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ వీరబాబు వున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



పెద్దాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలోని దర్గా సెంటర్ హెచ్‌పీ పెట్రోలు బంకు ఎదురుగా డ్రైనేజీ సమీపంలో అపస్మార స్థితిలో ఉన్న ఒక గుర్తు తెలియని వ్యక్తిని గుర్తించినట్టు ఎస్ఐ వి.మౌనిక మంగళవారం తెలిపారు. అతడి వయసు సుమారు 35-40 సంవత్సరాల మధ్య ఉంటుందని, కాకినాడ జీజీహెచ్‌కు తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు. మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 94409 04846 నెంబరును సంప్రదించాలన్నారు.

జాతీయ భద్రతా వారోత్సవాలు

సామర్లకోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాక్ సిరామిక్ పరిశ్రమలో జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ హెచ్ఆర్ అడ్మిన్ నీరజ్‌కుమార్ భద్రతా పతాకాన్ని ఆవిష్కరించారు. వేట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు విజేతలకు బహుమతులను నీరజ్ కుమార్, హెచ్‌వోడీలు అందజేశారు.

దువ్వాడ అనుచిత వ్యాఖ్యలపై జనసైనికుల ఫిర్యాదు

కరప, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు జనసేన నాయకులు మంగళవారం కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు బోగిరెడ్డి కొండబాబు, నున్న గణేష్‌నాయుడు, బోగిరెడ్డి గంగాధర్, యాళ్ల పండు, వై.హరనాథ్, పప్పుల మల్లిబాబు, గోన అంజి, జిల్లెల ప్రసాద్, చిన్నారి శ్రీను, నక్కా బ్రహ్మాజీ, శాకా వంశీ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం అభివృద్ధికి సింహాద్రి ఎన్టీపీసీ సాయం

పరవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతలో భాగంగా విశాఖ జిల్లా పరవాడలోని సంహాద్రి ఎన్‌టీపీసీ అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం ప్రాంతంలో మౌలిక వసతులు, ఆరోగ్యం, విద్యాభివృద్ధికి రూ.2.85కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించి ఎన్టీపీసీ హెచ్‌వోపీ సమీర్‌శర్మ కాకినాడ జిల్లా కలెక్టర్‌తో ఎంవోయూ చేసుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను కాకినాడ చీఫ్ ప్లానింగ్ అధికారికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సింహాద్రి అధికారులు బీబీ పాత్ర, కె.ప్రకాశరావు పాల్గొన్నారు.



చీఫ్ ప్లానింగ్ అధికారితో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌వోపీ సమీర్‌శర్మ

'జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి'

గొల్లప్రోలు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జనసేన అధికారంలోకి వచ్చిన తర్వాత పిఠాపురంలో జరుగుతున్న తొలి ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ పరిశీలకులు దాసరి రాజు, పీఎం రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు కోరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆవిర్భావ సభకు పలు కమిటీలతో పాటు ఆహ్వాన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే నా యకులు, జనసైనికులు, వీర మహిళలకు స్వాగతం పలికి వారు ఎటువంటి ఇబ్బంది లేకుండా సభా ప్రాంగణానికి చేరుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఆహ్వాన కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరావు

ఘనంగా షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

కరప, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో షిరిడీ సాయిబాబా మందిరం 24వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, జనసేన నేత చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకడ హారతి, సుప్రభాత సేవ, అభిషేకాలు జరిపారు. సామూహిక సాయి సత్యవ్రతాలు చేయించి గ్రామోత్సవం చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మహాన్నదానానికి 10వేల మంది విచ్చేసి ప్రసాదం స్వీకరించారు. సత్యవ్రతాల్లో పాల్గొన్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, లయన్ డాక్టర్ బొండా వెంకన్నరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సాయిబాబాను దర్శించుకుంటున్న జనసేన నేత దొరబాబు

ఏప్రిల్ 30న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

పిఠాపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 30న పాలిసెట్ జరుగుతుందని పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అక్కుల మురళి తెలిపారు. ఈ ఏడాది 69 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని... కాకినాడతో పాటు పిఠాపురంలో కూడా కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, ప్రస్తుతం పరీక్షలు రాసే విద్యార్థులు పాలిసెట్‌కు అర్హులని తెలిపారు. బీసీ, ఓసీ విద్యార్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100 ఫీజు. రిజిస్ట్రేషన్ కోసం పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారు. పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ మెకానికల్‌లో 66 సీట్లు, సివిల్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు మెస్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.

ఫిజియోథెరపీ శిబిరం

పెద్దాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్లోని భవిత కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. మండలంలోని శారీరక వైకల్యం ఉన్న పిల్లలు హాజరు కాగా ఎంఈవో వీఆర్కే సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు శివజ్యోతి, భవిత సిబ్బంది, ఫిజియోథెరపిస్టు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం మార్చి 4 (ఆంధ్రజ్యోతి) కాకినాడ ట్రాఫిక్ సీఐలు ఎస్.రమేష్ డి. రామారావు తమ బృందాలతో సోమవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మోతాదు దాటి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 25 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. 8 మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 17 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి మంగళవారం తీర్పు చెప్పారు.

'లైన్‌మెన్‌ల సేవలు వెలకట్టలేనివి'

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): లైన్‌మెన్‌ల సేవలు వెలకట్టలేనివని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్, ఏఈ ఉదయ్‌భాస్కర్ అన్నారు. ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ డివిజన్ కాకినాడ ఆధ్వర్యంలో జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని కాకినాడ డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ, ఏఈ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో లైన్‌మెన్‌లు అందించే సేవలు అమోఘమన్నారు. ఉత్తమ సేవలందించిన లైన్‌మెన్‌లను ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఈ వీరభద్రరావు, రాజాగోపాల్‌చౌదరి, విష్ణుమూర్తి, ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాదగయ హుండీల ఆదాయం రూ.11.75 లక్షలు

పిఠాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల సన్నిధిలో గల హుండీలను మంగళవారం తెరిచి లెక్కించారు. 17 రోజులకు రూ.11,74,660 ఆదాయం లభించింది. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ సీహెచ్ రామ్మోహనరావు, దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్, ఈవో జోగా సత్యనారాయణ, పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, భక్తులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

'రిలయన్స్' పౌష్టికాహార కిట్లు పంపిణీ

కాకినాడ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ ఇండస్ట్రీస్ సామాజిక సేవలో భాగంగా ఐసీడీఎస్ సహకారంతో కాకినాడ గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన సదస్సులో గాడిమొగ పంచాయతీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ జీజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాళ్లరేవు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.నళిని, రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.రాజేష్, రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం, సొసైటీ మేనేజర్ బిషన్‌దాస్ పాల్గొన్నారు.



పోలీసుల తనిఖీలు

సామర్లకోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పలు కొరియర్ సర్వీసులను, ట్రాన్స్‌పోర్టు గోదాములను సామర్లకోట పోలీసులు మంగళవారం జాగిలాలతో నిశితంగా పరిశీలించారు. పేలుడు రసాయనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎగుమతి, దిగుమతి చేయరాదని ఆయా సంస్థల ప్రతినిధులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

సామర్లకోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటకృష్ణరాయపురం గ్రామ శివారున రంగనాధం వీరభద్రరావు (చంటిబాబు)కు చెందిన పశువుల పాక మంగళ వారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. పాకలో ఉన్న ఐదు పశువులు మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాయి. తీవ్రంగా గాయపడిన రెండు పశువులు మృతి చెందాయి. మరో నాలుగు పశువులకు సైతం మంటలతో కూడిన గాయాలు కావడంతో ప్రభుత్వ పశువైద్యాధికారితో చికిత్స అందించారు. రైతు చంటిబాబుకు సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లినట్టు రెవెన్యూ అధికారులకు, పంచాయతీ అధికారులకు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు పూర్తిగా తెలియలేదని స్థానిక రైతులు చెప్పారు.

ఊబకాయంపై అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఊబకాయం ఒక మహమ్మారి అని దాని కారణాలు, నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ వసంతకుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ఒబెసిటీ దినోత్సవం సందర్భంగా మంగళవారం మెడికవర్ ఆసుపత్రి ఆవరణలో సెంటర్ హెడ్ శుభాకరరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ వంశీకృష్ణ, ఆపరేషన్ హెడ్ ఖాద్రి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్‌రామ్, మార్కెటింగ్ హెడ్ నాగరాజు, ఆసుపత్రి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తుని రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హంసవరం మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పద్మజ పేర్కొన్నారు. మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న జరగనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

ఏజెన్సీలో భవిత పాఠశాలల అభివృద్ధికి చర్యలు

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ఏడు మండలాల్లోని భవిత పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి ఐసీడీఎస్ అధికారులు, భవిత పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మానసిక వికలాంగులను గుర్తించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. 21 రకాల వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు గ్రామాల్లో సర్వేచేసి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలోని వికలాంగ బాలబాలికలకు సర్టిఫికెట్లు, పింఛన్లు మంజూరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మానసిక బాలబాలికలకు ఐడీ క్రియేట్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పోలియోపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, సీడీపీవో సంధ్యారాణి, ఎస్‌ఏ అర్చన రమణి, ఏడు మండలాల భవిత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీడిపిక్కల కొనుగోలుకు చర్యలు

ఏజెన్సీలో గిరిజనులు సేకరించిన జీడీపిక్కల కొనుగోలుకు చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన జీడిపిక్కల ప్రాసెసింగ్ ప్రతినిధులు, ఎన్జీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన రైతులు దళారుల నుంచి మోసపోకుండా చర్యలు చేపట్టామన్నారు. రైతుల నుంచి అధిక వడ్డీలు వసూలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జీడిపిక్కల రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ సీజన్‌లో 100 మెట్రిక్ టన్నుల జీడిపిక్కలు కొనుగోలే లక్ష్యంగా చర్యలు చేపట్టామన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజన ఉత్పత్తులకు సంబంధించిన యాప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీవో (జీ) డీఎన్వీ రమణ, పీహెచ్‌వో చిట్టిబాబు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పి.శ్రీనివాస్, వీడీవోలు ఎం.నాగేశ్వరరావు, ఎ.నాగేశ్వరరావు, ఉద్యానవనశాఖ సబ్ అసిస్టెంట్లు నూకరాజు, నాగరాజు, అబ్బాయిరెడ్డి, శోభన్‌బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి పట్టుభద్రుల మద్దతు



ఎటపాక: పేరాబత్తుల విజయంపై హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు, కూనవరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

●పేరాబత్తుల విజయంపై హర్షం

ఎటపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) మంచి ప్రభుత్వంకు అండగా పట్టుభద్రులు తమ ఓటుతో మద్దతు పలికారని పేరాబత్తుల రాజశేఖరం ఘనం విజయంపై మంగళవారం టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎటపాకలో టీడీపీ సీనియర్ నాయకులు కిలారి వెంకన్న, పాటి చలపతిరావు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. రాజశేఖరం గెలుపు నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలకు, శ్రేణులకు స్వీట్లు పంచారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు నలజాల శ్రీకాంత్ చౌదరి, పాటి సంపత్, డి.రాము పాల్గొన్నారు.

కూటమి నాయకులకు ధన్యవాదాలు

కూనవరం: ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నుంచి పోటీ చేసిన పేరాబత్తుల రాజశేఖర్ గెలుపుకు కృషిచేసిన నాయకులకు కూనవరం టీడీపీ మండల కమిటీ ధన్యవాదాలు తెలిపింది. మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బరపాటి ప్రకాశరావు, అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, బూత్ ఇన్‌చార్జి చలికాని ఉమామహేశ్వరరావు, హెచ్ రాము, బండారు శివయ్య, పారి సోమయ్య, రాజారావు, హెచ్ రవి, ఎడ్ల రాంబాబు, ఎడ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రాజశేఖర్ గెలుపుపై సంబరాలు

రాజవొమ్మంగి: ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన పేరాబత్తుల రాజశేఖరం అత్యంత మెజార్టీతో గెలుపొందడంపై మండలంలో కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. రాజవొమ్మంగి మండల టీడీపీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో కూటమి నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పెద్దిరాజు, జెట్టి మధు, ముప్పన మోహన్, పెదిరెడ్ల సత్తిబాబు, కోటంశెట్టి సత్యనారాయణ, మాకిరెడ్డి లోవరాజు, వినంశెట్టి సత్తిబాబు, గంగిరెడ్ల బుజ్జి, ల్లి నానాజీ, నూకరాజు పాల్గొన్నారు.

దేవీపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపుపై మండలంలోని ఇందుకూరులో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మాగాపు బాబురావు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోళ్ల చంటిబాబు, చవలం శివరామకృష్ణ, చారపు రాంబాబు, ముచ్చు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

రాజవొమ్మంగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి సర్కిల్ పరిధిలోని రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్‌స్టేషన్లను జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రెండు స్టేషన్లలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ప్రశాంత్‌కుమార్, సీఐ ఎన్.సన్యాసినాయుడు, ఎస్ఐ చిన్నబాబు, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్ వద్ద జిల్లా ఎస్పీ

చెట్టుకి ఉరేసుకుని కార్మికుడి మృతి

దేవీపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగుకూరు గ్రామంలో నందిని క్యాంపు వెనుక ఉన్న అటవీ ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు పవర్ హౌస్‌లో వెల్డింగ్ పనిచేసే కార్మికుడు అస్సాం రాష్ట్రానికి చెందిన హనీదుల్ ఇస్లాం(29) ఈనెల 2వ తేదీన రాత్రి సమయంలో చెట్టుకి ఉరేసుకుని చనిపోయినట్లు దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు చెందిన లేబర్ కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. మృతుడు పోలవరం ప్రాజెక్టు నుంచి పనిచేస్తున్నాడన్నారు.

సబ్ రేషన్ డిపోలు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ నాయకులు

దేవీపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీ పెద్ద భీంపల్లి 2, చిన్నారిగండి ఆర్అండ్ఆర్ పెనికలపాడు గ్రామాల్లో సబ్ రేషన్ డిపోలు ఏర్పాటుచేయాలని కోరుతూ మంగళవారం ఆదివాసీ నాయకులు తహసీల్దార్ కె.సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 200 రేషన్ కార్డులు కలిగిన ప్రజలు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇందుకూరు1 ఆర్అండ్ఆర్‌కాలనీ మ ంటూరు గ్రామంలో ఉన్న రేషన్ డిపోకి నడిచి వెళ్లాల్సి వస్తుందన్నారు. పెద్దభీంపల్లి 2 ఆర్అండ్ఆర్ కాలనీలో జీసీసీ డీఆర్ డిపో నందు, పెనికిలపాడులో కమ్యూనిటీ హాల్ నందు రేషన్ సరుకులు ఇప్పించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్ లేకపోవడం వలన ఈ సమస్య వచ్చిందని ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పేరాబత్తుల విజయంపై హర్షం

పలుచోట్ల కూటమి శ్రేణుల సంబరాలు



కోటనందూరులో స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు

కోటనందూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజా విజయం సాధించడంతో కోటనందూరులో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ర్యాలీ చేసి భారీ బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, అంకంరెడ్డి రమేష్, వెలగా వెంకట కృష్ణారావు, చిటికెల సత్యనారాయణ, పెనుముచ్చు నాగేశ్వరరావు, యర్ర చినసత్యనారాయణ, బోడపాటి సత్యనారాయణ, చింతకాయల రవికుమార్, సామినీడి కృష్ణార్జున, వాసం నాగేశ్వరరావు, బైలపూడి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు రాబోయే మంచి రోజులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు నిదర్శనమని టీడీపీ కాట్రావులపల్లి గ్రామ అధ్యక్షుడు ముసిరెడ్డి నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన పేరాబత్తులను అభినందించారు. ఈ గెలుపు ఎమ్మెల్యే నెహ్రూపై నమ్మకానికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్ కష్టానికి దక్కిన ప్రతిఫలమన్నారు.

రౌతులపూడి: పేరాబత్తుల రాజశేఖరం విజయంపై మూలగపూడి గ్రామంలో కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి, కార్యకర్తలకు స్వీట్లు పంచారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి పేరాబత్తులకు ఓట్లు వేశారని పేర్కొన్నారు.

తొండంగి: పేరాబత్తుల రాజశేఖరం విజయంపై జిల్లా మత్స్యకార టీడీపీ నేత కోడ వెంకట రమణ, మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, తెలుగు యువత అధ్యక్షులు బంటుపల్లి అన్వేష్, దూలం మురళి, సాధనాల నూకరాజు, చొక్కా కాశీశ్వర్రావు హర్షం వ్యక్తం చేశారు.

గండేపల్లి: పేరాబత్తుల అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ముమ్మాటికి ఇది ప్రజావిజయమేనని మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం, విశ్వాసానికి నిదర్శనం పేరాబత్తుల గెలుపు అన్నారు. పట్టభద్రుల నమ్మకాన్ని పేరాబత్తుల నిలబెట్టుకుంటున్నారన్నారు. పేరాబత్తు గెలుపునకు కృషిచేసిన బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులకు వసంత్ ధన్యవాదాలు తెలిపారు.

కూటమి విజయం ప్రభుత్వ పనితీరుకు అద్దం : ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయం సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర పాలనా దక్షితకు నిదర్శనమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్ భారీ మెజార్టీతో గెలుపొందడం చారిత్రాత్మక విషయమన్నారు. పేరాబత్తుల ఘన విజయం సాధించడం పట్ల నియోజకవర్గ కూటమి నాయకులు వరుపుల తమ్మయ్యబాబు, కొమ్ముల కన్నబాబు, పెంటకోట మోహన్, దాసం శేషారావు, ఉమ్మిడి వెంకట్రావు, సింగిలిదేవ్ సత్తిరాజు, ఊటా వీరబాబు, టీడీపీ నాయకులుయాళ్ళ జగదీష్, అంబటి బుజ్జి, అమరాది వెంకట్రావు, పల్లా గోపి, దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, వెలుగుల నాని, బొల్లు వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

వరుపుల రాజా ఆశయ సాధనకు కృషి

దివంగత నేత రాజా ద్వితీయ వర్ధంతి

ప్రత్తిపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దివంగత టీడీపీ నేత వరుపుల రాజా ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి, బడుగు బలహీన వర్గాలకు ఎంతో కృషి చేశారని ఆయన ఆశయ సాధన కోసమే పని చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు రాజా సతీమణి, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మంగళవారం రాజా ద్వితీయ వర్ధంతి సందర్భంగా పెదశంకర్లపూడిలోని వ్యవసాయ క్షేత్రంలో రాజా సమాధి వద్ద ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారని ఆయన ఆశయాలు నెరవేర్చడం కోసమే తాను రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందన్నారు. నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకుల అండదండలతో రాజా కలలు కన్న నియోజకవర్గ అభివృద్ధి చేయడమే తన జీవిత ధ్యేయమన్నారు. అలాగే ప్రత్తిపాడులోని వరుపుల రాజా విగ్రహానికి టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, దాట్ల అప్పన్నబాబు, బొల్లుకొండబాబు, ఇంధన ఏసుబాబు, వెలుగులనాని, బొల్లు వెంకటేశ్వరరావు, అంబటి బుజ్జి, రావూరి తాతాజీ, పోలిశెట్టి శ్రీను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్యతో కలిసి పంపిణీ చేశారు. అలాఏ గజ్జనపూడిలో నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాకారపు కృష్ణ, పల్ల గోపి తదితర నాయకులు ఉన్నారు.

శంఖవరం: శంఖవరంలో టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంచారు. కత్తిపూడిలో వెన్నా ఈశ్వరుడు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి ప్రజలకు గుండె పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుబాష్, ఉల్లి వీరభద్రరావు, ఈగల దేవుళ్ళ, సర్గం గోవిందు, మాజీ జెడ్పీటీసీ బచ్చల గంగ, కర్రి శివాజీ, బద్ది రామకృష్ణ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణ టీడీపీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి నేతృత్వంలో రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. భవితా కేంద్రంలో విద్యార్థులకు అలమండ వీర్రాఘవస్వామి పండ్లు, బిస్కట్లు అందజేశారు. లింగంపర్తిలో రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూతి బూరయ్య, బస్వా ప్రసాద్, జిగటాపు సూరిబాబు, బుగతా శ్రీను, సామంతుల గోపి, కోరాడ కృష్ణ మోహన్, నూకతాటి ఈశ్వరుడు, జె.వీరబాబు ఉన్నారు.



ప్రత్తిపాడు: పెదశంకర్లపూడిలో రాజా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి: రౌతులపూడి టీడీపీ కార్యాలయం నందు మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యబాస్కరరావు, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల సాంబశివరావు తదితరులున్నారు.



రౌతులపూడిలో రొట్టెలు పంచుతున్న టీడీపీ నేతలు

జనసేన ఆవిర్భావ సభ విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న రమేష్, నాయకులు

జగ్గంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పిఠాపురం నియోజకవర్గ చిత్రాడ గ్రామంలో నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు పార్టీ శ్రేణులు భారీసంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పిలుపునిచ్చారు. జగ్గంపేట కృష్ణవేణి థియేటర్ వద్ద మంగళవారం జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జగ్గంపేట నియోజకవర్గంలో జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరవ్వాలన్నారు. 4 మండలాల్లో 4 కమిటీలు ఏర్పాటు చేశామని, ప్రతి కమిటీలో 5 మంది సభ్యులు ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, ఎంపీటీసీలు దొడ్డా శ్రీను, గోకేడ రాజా, చక్రరావు, జిల్లా కో ఆర్డినేటర్ సూరంపాలెం బాలు, సీనియర్ నాయకులు మేడిబోయిన శ్రీను, కుంచే కోటి, కిర్లంపూడి మండల అధ్యక్షులు ఉలిసి ఐ రాజు, జగ్గంపేట మండలం అధ్యక్షులు మరిసే రామకృష్ణ, జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ నరసింహం, ఐటీ కో ఆర్డినేటర్ అరినే రాజేష్, గంధం ప్రభాకర్ ఉన్నారు.

బడ్జెట్ స్వర్ణాంధ్రప్రదేశ్‌కు నాంది: ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ నవ్యాంధ్రప్రదేశ్‌కు నాంది పలుకుతుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. విజనరీ కలిగిన తమ నేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం డబల్‌ఇంజన్ స్పీడ్‌తో ముందుకెళుతుందన్నారు. బడ్జెట్‌కు అభినందన పురస్కరించుకుని శాసనసభలో ఆమె ప్రసంగించారు. బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారన్నారు. బలహీన వర్గాలకు ఆర్థిక, ఉపాధి కల్పించడంలో వనరులు పుష్కలంగా కేటాయింపులు చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసిన సాగునీటి రంగాలకు ఆర్థికంగా నిధులివ్వడం అభినందనీయమన్నారు. ఎన్నికల ప్రతి హామీ నెరవేర్చడంలో ప్రభుత్వం సఫలీకృతం అవుతోందన్నారు. బడ్జెట్ నూతన శకానికి స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యపడటానికి సహకరిస్తుందన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న యనమల దివ్య

'మహిళలు రాణించాలి'

కిర్లంపూడి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల మహిళా సమాఖ్య మీటింగ్ హాల్‌లో మంగళవారం హెల్తీ ఓమెన్ హ్యపీ ఓమెన్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలు సాంకేతిక రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో హరికృష్ణ, ఎంఈవో జోసెఫ్, సూపర్‌వైజర్లు కరిమున్నీసా, బూసమ్మ, సునీత పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రత్తిపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మినర్వా కళాశాల వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై నడుస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పారావు చెప్పారు.

నెల్లిపాక లైన్‌మెన్‌కు ఉత్తమ పురస్కారం



పురస్కార అవార్డు అందుకుంటున్న లైన్‌మెన్ దేవేందర్ నాయక్

ఎటపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా అల్లూరి జిల్లా ఎటపాక మండలం, నెల్లిపాక లైన్‌మెన్ జాటోతు దేవేందర్ నాయక్‌కు ఉత్తమ పురస్కార అవార్డు లభించింది. ఈమేరకు మంగళవారం రంపచోడవరంలో జరిగిన కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ గబ్రీయల్ లైన్‌మెన్ దేవేందర్ నాయక్ పురస్కారంను అందుకున్నారు. విధుల్లో ఆయన చేసిన సేవలకుగానూ ఈ పురస్కారంను అందించినట్లు లైన్‌మెన్ తెలిపారు.

పొల్లూరులో పారిశుధ్య పనులు

మోతుగూడెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో పొల్లూరులో సోమవారం జరిగిన మన్యం కొండ జాతరకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో వారి వినియోగించుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటాల్ బాటిల్స్ అక్కడే పేరుకుపోయాయి. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని రక్షించే ప్రయత్నంలో భాగంగా అక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు అన్నింటినీ కాల్చి బూడిద చేశారు. పంచాయతీ కార్యదర్శి జి. మోహన్ దగ్గరుండి పనులు పర్యవేక్షించారు.

బస్టాండ్ నిర్మాణం కోసం స్థల పరిశీలన



రాజవొమ్మంగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం కోసం మంగళవారం తహసీల్దార్ అల్లి సత్యనారాయణ స్థల పరిశీలన చేశారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా అల్లూరి జంక్షన్ వద్ద పోలీస్‌స్టేషన్ ఎదురుగా, ఆంజనేయస్వామి గుడివద్ద బస్సు షెల్టర్‌లు తొలగించడంతో ప్రయాణీకులు నిలువ నీడలేక పడే ఇక్కట్లను గమనించి ఆదివాసీ సంఘాలు ఇటీవల తహసీల్దార్‌ను కలిశారు. సోమవారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సుడిగాలి పర్యటనలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ బస్సుషెల్టర్ పునః నిర్మాణం విషయం పీవో దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో మంగళవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ సభ్యులు గంప నాగరాజు, ఈక శ్రీను ఉన్నారు.

సాంకేతిక విద్యను యువత అలవర్చుకోవాలి

కలెక్టర్ షాన్‌మోహన్



కాకినాడలో స్పార్క్ సభ్యులకు ప్రశంసా పత్రం అందిస్తున్న కలెక్టర్

ఏలేశ్వరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యను యువత అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అన్నారు. మంగళవారం కాకినాడలో స్పార్క్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు కలెక్టర్‌ను కలిసి దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలకు సంబంధించి హ్యాక్ ఫ్రీ సైబర్ ఫ్రో లాక్ కాన్సెప్ట్‌పై చర్చించారు. ఇప్పటివరకు స్పార్క్ సంస్థ ప్రస్తుత టెక్నాలజీ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన వాటిని కలెక్టర్‌కు వివరించారు. స్పార్క్ ఫౌండేషన్ చైర్మన్ ప్రదీప్ యూనివర్సిటీ ఛాలెంజ్‌లో విజేతగా నిలిచినందుకు కలెక్టర్ ప్రశంసాపత్రంతో అభినందించారు.

'వస్తువులను ఆన్‌లైన్‌లో అమ్మాలి'

కిర్లంపూడి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉత్పత్తి చేస్తున్న వస్తువులను ఆన్‌లైన్‌లో అమ్మకాలు చేసే విధంగా చూడాలని సీసీ బుల్లియ్య వీవోఏలకు సూచించారు. కిర్లంపూడి ఆంధ్రాబ్యాంకు పక్కన ఏపీఎం వేదకుమారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి వీవోఏల పనితీరుపై చర్చించారు. జమా ఖర్చులు తప్పనిసరిగా నమోదుచేయాలన్నారు.

బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రత్తిపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భరతమాత తదితరుల చిత్రపటాలకు బీకేఎస్ నాయకులు యల్లపు సూర్యనారాయణ, రాసంశెట్టి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మవరంలో బీకేఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.

లైన్‌మెన్‌కు సత్కారం

ఏలేశ్వరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): లైన్‌మెన్స్ దినోత్సవం పురస్కరించుకుని విద్యుత్ శాఖ నేతృత్వంలో ఉత్తమ ప్రతిభ అవార్డులు అందజేశారు. మంగళవారం జగ్గంపేట డివిజన్ విద్యుత్ కార్యాలయంలో డీఈ వీరభద్రరావు, అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖరం, ఏఈ సూర్యనారాయణ యర్రవరం లైన్‌మెన్ సింహాచలానికి ప్రశంసాపత్రంతో శాలువా కప్పి సత్కరించగా పలువురు అభినందించారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్

జగ్గంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మేడిబోయిన శ్రీను, రాజాల శ్రీను, సూరపు రెడ్డి నరేష్, ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మాదారపు వీరబాబు, మొగిలి గంగాధర్, అడబాల వీరబాబు, జీవీ నాయుడు, గంటా తేజ ఉన్నారు.

జాతీయ భద్రతా వారోత్సవాలు

తొండంగి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఒంటిమామిడిలో ఉన్న దివిస్ ఫార్మా పరిశ్రమలో మంగళవారం జాతీయ భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక అధికారి పివిసాయి రాజేష్ భద్రతా పతాకాన్ని ఆవిష్కరించారు. భద్రతా పరికరాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రారంభించారు. పరికరాల వినియోగం, ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కంపెనీ ఉపాధ్యక్షుడు ఎల్‌వి.రమణ, జనరల్ మేనేజర్ నాగేశ్వర్, అగ్నిమాపక అధికారి కుమారి రాముడు తదితరులు ఉన్నారు.

రెండో రోజు రిలే దీక్షలు

ఏలేశ్వరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ ఎస్వీ రమణను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ రెండోరోజు యూనియన్ సభ్యులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. మంగళవారం ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు సంయుక్తంగా ఆర్టీసీ డిపో ప్రాంగణంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.